నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
1
గురువారం | జులై 18, 2024 | www.navatelangana.com

గ్యారంటీ స్కీంలను వెంటనే అమలు చేయాలి



నవతెలంగాణ -చిట్యాల టౌన్

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ స్కీంలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బొడిగ సైదులు గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని గుండ్రంపల్లి గ్రామంలో బుధవారం జరిగినఆ పార్టీ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల పథకాలను వెంటనే అమలు చేసి, ఇండ్లు లేని పేదలకు ఇప్పటికే నిర్మించిన డబుల్ బేడ్ రూం ఇండ్లను పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఆ పార్టీ నాయకుడు ఏర్పుల రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ గ్రామశాఖ కార్యదర్శి జిల్లా సత్యం, సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, నాయకులు బోడిగె ఒక్కశెట్టి, జిల్లా యాదయ్య, రెడపాక శేఖర్, రత్నం లింగస్వామి. నమ్మల స్వామి పాల్గొన్నారు.

చామల యాదగిరి రెడ్డి జయంతి

నవతెలంగాణ-శాలిగౌరారం



స్వాతంత్ర్య సమర యోధుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చామల యాదగిరిరెడ్డి జయంతిని బుధవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి నివాళు లర్పించారు. పలువురు చామల యాదగిరి రెడ్డి సేవలను కొనియాడారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు,బ్రెడ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూని వెంకటయ్య,జిల్లా ఉపాధ్యక్షుడు అన్నేబోయిన సుధాకర్, ఆ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరం రెడ్డి,చామల రమణారెడ్డి పాల్గొన్నారు.

మంజులకు న్యాయం చేసి రక్షణ కల్పించాలి

- **ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి**



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

తిప్పర్తి మండలం సర్వారం గ్రామానికి చెందిన దారమళ్ల మంజులపై క్రూరంగా ప్రవర్తిస్తున్న వారి అత్త ,మామ దారమళ్ల మరియమ్మ వెంకులు వారి బంధువు గూడపురి బాలరాజు పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడు ప్రభావతి డిమాండ్ చేశారు. బుధవారం సర్వారం గ్రామంలో దారమళ్ళ మరియమ్మ భర్త వెంకులు ఇంటిముందు బాధితురాలు మంజులకు న్యాయం జరగాలని చేస్తున్న ధర్నాలో ఆమెకు మద్దతుగా ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ సర్వారం గ్రామానికి చెందిన దారమళ్ళ సవేందర్‌తో మంజుల వివాహం జరిగిందని సవేందర్ సంవత్సర క్రితం చనిపోవడం జరిగిందన్నారు. సవేందర్ చనిపోయిన తర్వాత మంజులను వారి అత్త మామ మరియమ్మ వేంకులు తోపాటు బంధువైన గూడపురి బాలరాజు మంజులను ఇంటి నుండి బయటకు వెళ్లగొట్టి మంజులను మానసికంగా కృంగిపోయే విధంగా చేశారని తెలిపారు. బాలరాజు ఆస్తి మీద కన్నేసి కావాలని మరియమ్మ, వెంకులకు మంజులపై కోపం వచ్చే విధంగా వారిని రెచ్చగొట్టి మంజులను బయటికి పంపించారని ఆరోపించారు. ఎన్నిసార్లు పెద్దమనుషులతో మాట్లాడిన వారు ఇంట్లోకి రానియకపోవడంతో రెండు రోజుల నుంచి మంజుల వారి ఇంటి ముందు నిరసన చేస్తున్నదన్నారు. వెంటనే అధికారులు స్పందించి మంజులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మంజులకు ప్రాణహాని ఉందని, వారికి న్యాయం చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఎవరైనా మహిళల పట్ల చులకన భావంతో ఉండి మహిళలని ఇబ్బంది పెట్టే విధంగా చేసే వారిపై వెంటనే చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాలు బొల్లెపల్లి మంజుల, జంజీరాల ఉమా, రేవతమ్మ భాగ్యమ్మ, మమత, పూలమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్ష నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు

- హాజరుకానున్న 4440 మంది అభ్యర్థులు
- నేటి నుండి ఆగస్టు 5 వరకు కొనసాగనున్న పరీక్ష
- పరిశీలకులుగా ఇద్దరు అధికారుల నియామకం

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ-2024 పరీక్షకు జిల్లా విద్యాశాఖ పకడ్బం దీగా ఏర్పాట్లు చేసింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2017 జులైలో మొదటి డీఎస్సీ నిర్వహించారు. తర్వాత ఏడేళ్లకు నిర్వహిస్తున్న రెండో పరీక్ష ఇది. ఈ నెల 18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించే పరీక్షకు నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో 4440 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. వీరి కోసం జిల్లా కేంద్రంలోని రామగిరి లో గల ఎస్పీఆర్ పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. రోజుకు 185 మంది అభ్యర్థులు 24 షిఫ్ట్ లలో 12 రోజులపాటు పరీక్ష రాయనున్నారు.

మొదటిసారిగా కంప్యూటర్ ఆధారిత ఆన్లైన్ (సిబిటి) విధానంలో పరీక్షలు జరగనున్నాయి. మొదటి విడత ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, రెండో విడత మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుంది. నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతిని పర్యవేక్షణ అధికారిగా నియమించారు. కేంద్రాల్లో ఎలాంటి అక్రమాలు జరగకుండా పరిశీలకులుగా సెక్టోరియల్ అధికారి ఆర్. రామచంద్రయ్య, గజిటెడ్ హెడ్మాస్టర్ సైదానయక్ ఇద్దరు అధికారులను నియమించారు.



అధికారులకు సూచనలు

జిల్లా విద్యాశాఖ అధికారి, డీఎస్సీ పరీక్షల పర్యవేక్షణ అధికారి బిక్షపతి జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ స్కూల్లో ఏర్పాటు చసిన పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉండి కావలసిన ఏర్పాట్లను పూర్తి చేయించారు. డీఎస్సీ పరీక్ష ల నిర్వహణ పట్ల తగు సలహాలు, సూచనలు అధికారులకు అందజేశారు. పరీక్ష కేంద్రంలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పరీక్ష సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

రెండు గంటల ముందే చేరుకోవాలి...

బిక్షపతి (డిఇఓ) డీఎస్సీ పరీక్షల పర్యవేక్షణ అధికారి

డీఎస్సీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే కేంద్రాలకు చేరుకోవాలి. నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచే లోపలికి అనుమతిస్తారు. పది నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్, ప్రభుత్వ గుర్తింపు కార్డు, బాల్పాయింట్ పెన్ను వెంట తెచ్చుకోవాలి. గడియారాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, నిబంధనల్లో పేర్కొన్నవి ఎట్టి పరిస్థితుల్లో అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష హాల్ టికెట్ తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలి. హాల్ టికెట్ లో ఇంటి పేరు పడి, పూర్తి పేరు పడని అభ్యర్థులు ఏదైనా ఒరిజినల్ సర్టిఫికెట్ ను వెంట తెచ్చుకోవాలి. అదేవిధంగా హాల్ టికెట్ పై ఫోటో పడని అభ్యర్థులు ఫోటోను వెంట తెచ్చుకోవాలి.



నేడు అకౌంట్లోకి లక్ష రుణమాఫీ: ఎమ్మెల్యే

నవతెలంగాణ-దేవరకొండ

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ విషయంలో శుభవార్త తెలిపిందని, నేడు అర్హులైన రైతుల ఖాతాలో లక్ష రుణమాఫీ డబ్బులు జమ చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పట్టాదారు పాస్ పుస్తకం ఆధారంగానే రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని, కేవలం కుటుంబ వివరాలను గుర్తించడానికి మాత్రమే రేషన్ కార్డు నిబంధన విధించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరచడానికి వ్యవసాయ అభివృద్ధికి రైతుల సంక్షేమాన్ని మెరుగుపరచడానికి పంట రుణాల మాఫీని ఒక అత్యవసర పెట్టుబడిగా గుర్తించిందన్నారు. ఏకకాలంలో రైతుల రుణమాఫీ చేసిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డిది అని గుర్తు చేశారు. బీఆర్ఎస్ వచ్చాక రైతులకు మోసం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ రైతులకు 2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం హామీ చేసి చూపిస్తుందని తెలిపారు. రైతు రుణమాఫీ ఇదొక చారిత్రకమైన ఘట్టమని అన్నారు. ఆగస్టు 15 లోపు మరో లక్ష రైతు రుణమాఫీ చేసి కాంగ్రెస్ మాట నిరూపించుకుంటుందని గుర్తు చేశారు. అసెంబ్లీ సమావేశాలలో రైతు భరోసా పై చర్చించి ఎకరానికి రూ .7,500 చొప్పున సంవత్సరానికి 15000 ఇవ్వడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, మాజీ మున్సిపల్ చైర్మెన్ వాడ్య దేవేందర్ నాయక్, టీపీసీసీ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మహమ్మద్ యూనూస్, కొర్ర రామ్ సింగ్ , కిన్నెర హరికృష్ణ, అంగిరేకుల నాగభూషణం పాల్గొన్నారు.



ఆర్ఎంపీ, పీఎంపీలకు అండగా ప్రభుత్వం

- **ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఆర్ఎంపీ, పీఎంపీలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రూరల్ మెడికల్ ప్రాక్టీస్ అసోసియేషన్ సభ్యులు నల్గొండ జిల్లా అధ్యక్షులు దొరపల్లి మల్సూర్ ప్రధాన కార్యదర్శి ఎం డి జానీ మియా, కోశాధికారి, మిర్యాలగూడ మండల్ టౌన్ అధ్యక్షులు పగిడిమర్రి గోవర్ధన చారి, రాష్ట్ర ఈసీ మేంబర్ వై శ్రీనివాసు బాబు, జిల్లా గౌరవ అధ్యక్షులు జకరయ్య పి రవీందర్, కోటా చారి గారుకృష్ణమూర్తి, రాంబాబు, అంజి బాబు, శంకర్, సైదులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

షరతుల్లేకుండా 2లక్షల రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-మునుగోడు



రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 2 లక్షల రుణమాఫీని ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చేందుకు రైతులను రాజు చేస్తాం ..రైతు రాజ్యం కోసం కృషి చేస్తామని ఉపన్యాసాలు ఇవ్వడం కాదు.వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులను ప్రభుత్వం ఆదుకున్నప్పుడే రైతు రాజ్యం అవుతుందని అన్నారు. రెండు లక్షల రుణమాఫీని ఒకే విడతలు వచ్చేసి రైతు ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. రుణమాఫీ అయిన రైతులకు వెంటనే కొత్త రుణాలను రుణాలు అందించే విధంగా బ్యాంక్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు.గత 2009లో కాంగ్రెస్ ప్రభుత్వంలో కౌలు రైతులను ఆదుకునేందుకు కౌలు కార్డులను అందించిన విధంగా కౌలు చేస్తున్న రైతులను గుర్తించి కొత్తగా కౌలు కార్డులను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులకు ఇబ్బంది కలిగే విధంగా రుణమాఫీలో కొత్త విధానాలను తీసుకొస్తే రైతులతో పెద్ద ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సాగర్ల మల్లేష్, యాట యాదయ్య పాల్గొన్నారు.

వేముల నరేష్‌కు అంతిమ వీడ్కోలు

నవతెలంగాణ-శాలిగౌరారం



తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుడు వేముల నరేష్ అనారోగ్య సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈ సందర్భంగా నిమ్స్ ఆస్పత్రిలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం బుధవారం తెల్లవారుజామున నరేష్ భౌతిక ఖాయనికి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం వేముల నరేష్ స్వగ్రామమైన ఊటుకూరు గ్రామంలో ఆయన భౌతిక కాయానికి జెడ్పీచైర్మెన్ బండ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, జిల్లా మాజీ గ్రంధాలయ చైర్మెన్‌మల్లికార్జున్ రెడ్డి, డాక్టర్ చెరుకు సుధాకర్ ,మాజీ జెడ్పిటిసిలు మాద యాదగిరి,జీడీ భిక్షం,అన్నెబొయిన సుధాకర్, అయితగోని వెంకన్న గౌడ్, వేముల అందీప్, వేముల గోపీనాథ్ ,మద్దెల సందీప్, మానుకోట ప్రసాద్ పలువురు నివాళులర్పించారు. వేముల పుష్ప ఆధ్వర్యంలో కళాకారులతో పెద్ద ఎత్తున అంతిమయాత్ర నిర్వహించి వీడ్కోలు పలికారు.ఈ కార్యక్రమంలో కళాకారులు గిద్దె రామ నర్సయ్య,పెరాల యాదగిరి, వసంత, భిక్షపతి , పల్స నిర్మల, సాయి, ధనశేఖర్, ఎర్ర అనుదీప్ , వేణు,శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లాలో మంత్రి కోమటిరెడ్డి పర్యటన

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

రాష్ట్ర రోడ్లు, భవనాలు ,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం నల్గొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్ నుండి బయలుదేరి మధ్యాహ్న 1:30 గంటలకు నల్లగొండ చేరుకుంటారు. జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 5:30 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్తారు.



ఆయిల్ ఫామ్ సాగుతో .. అధిక ఆదాయం

నవతెలంగాణ-శాలిగౌరారం

నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ తోటలను సాగు చేసి అధిక ఆదాయం పొందాలని నకిరేకల్ డివిజన్ ఉద్యాన అధికారి రావుల విద్యాసాగర్ అన్నారు. శాలిగౌరారం మండలం లింగోటం గ్రామంలో ఆయిల్ పామ్ మేఘ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా దేశబోయిన సురేష్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని రైతులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆయిల్ ఫామ్ తోటలను సాగుచేసి అధిక ఆదాయం పొందాలని కోరారు. ఈ పంటకు కూలీ ఖర్చులు తక్కువ, అన్నారు. ఆయిల్ ఫామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ప్రభుత్వం నియమించిన కంపెనీ వారే విక్రయస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో పతంజలి ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ నరేందర్,క్షేత్ర సహాయకులు కట్టగూరి రాము, పలువురు రైతులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

- **కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగాని సీతారాములు**



నవతెలంగాణ-చిట్యాలటౌన్

శాసనసభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కల్లుగీత కార్మిక సంఘ: జిల్లా ప్రధాన కార్యదర్శి చౌగని సీతారాములు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మేకల లింగయ్య భవనంలో ఆ సంఘం మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షులు మామిడి హనుమంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తవుతున్న ఇప్పటివరకు ఇచ్చిన హామీలు అమలకు నోచుకోలేదని ఆవేదన వెలిబుచ్చారు .ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సొసైటీలో, టిఎఫ్టి లలో సభ్యత్వం కలిగిన ప్రతి కల్లుగీత కార్మికునికీ కాటమయ్య కవచాలను అందించాలని, అదేవిధంగా ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు10 లక్షల ఎక్స్‌గ్రేషియా నెలలోపు అందించాలని, మెడికల్ బోర్డు నిబంధన ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా గౌరవాధ్యక్షులు పామనుగుండ్ల అచ్చాలు మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి కేటాయించిన నీరా కేఫ్‌లను టూరిజం డిపార్ట్మెంట్‌కు అప్పగించడం సరికాదన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు ఈ సమావేశంలో సంఘం మండల కార్యదర్శి గుణగంటి కృష్ణ, సంఘం మండల కమిటీ సభ్యులు గుణగంటి బిక్షపతి, కొత్తపల్లి శ్రీధర్, పాలెం సత్తయ్య, బూరుగు శ్రీను, గుండాల యాదయ్య, బియ్యపు అంజయ్య పంతంగి వెంకన్న, కాసుల సత్యనారాయణ, రేగట్ట నరసింహ పాల్గొన్నారు.

నేడు రైతులతో ముఖాముఖి

నవతెలంగాన-చిట్యాలటౌన్

రైతు రుణమాఫీ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం ఈ ప్రాంత రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండలం ఊరుమడ్ల గ్రామంలో గల రైతు వేదికలో జరిగే రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ,నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం పాల్గొంటారని తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురు అరెస్ట్

- నిందితుల్లో ఒకరు మహిళ పరారీలో మరో ఇద్దరు
- 73.825 కేజీల గంజాయి స్వాధీనం, దాని విలువ 18.45 లక్షలు
- 5 సెల్ ఫోన్లు, కారు స్వాధీనం

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్



ఒడిస్సా నుండి ఉత్తరప్రదేశ్‌కు కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురు నిందితులను నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు కొర్లపాడు స్టేజి వద్ద పట్టుకున్నారు. వీరి నుండి 73. 825 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ గంజాయిని 89 ప్యాకెట్ల ను చేసి రవాణా చేస్తున్నట్లు నల్లగొండ డిఎస్పి కే. శివరామిరెడ్డి చెప్పారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ 18,45,625 రూపాయలు ఉంటుందని ఆయన చెప్పారు. బుధవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టుబడ్డ గంజాయి, నిందితుల వివరాలను డీఎస్పీ శివరాం రెడ్డి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్, గ్రేటర్ నోయిడా గౌతమ్ బుద్ధనగర్‌కు చెందిన అశోక్ కుమార్, మొరాదాబాద్ కు చెందిన దీపు కుమార్, ఢిల్లీకి చెందిన సుష్మా రాయ్‌లు యూపీ 19 జె 0018 నెంబర్ గల వెర్నా కారులో ఒడిస్సా లోని కలిమెల, మల్కాన్ గిరి నుండి గంజాయిని ఉత్తరప్రదేశ్ కు తీసుకెళ్తుండగా కొర్లపాడు చెక్ పోస్ట్ వద్ద పట్టుబడ్డారని డీఎస్పీ శివరాం రెడ్డి తెలిపారు. పట్టుబడ్డ ముగ్గురు నిందితులు మల్కాన్ గిరి వద్ద సుశాంత్ బడాయి వద్ద 89 ప్యాకెట్లలో గంజాయిని కొనుగోలు చేసి దాన్ని ఉత్తరప్రదేశ్ లో ప్రేమ్ సింగ్‌కు అందజేసేందుకు వెళుతుండగా అదుపులోకి తీసుకున్నారు. ప్రేమ్ సింగ్, సుశాంత్, బడాయిలు పరారీలో ఉన్నారు. పట్టుబడ్డ నిందితుల నుండి 5 సెల్ ఫోన్లు, వెర్నా కారును స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చేరవేసినందుకు ప్రేమ్ సింగ్ ఒక్కొక్కరికి 20వేల రూపాయలను అందిస్తాడని తెలిపారు. పరారీలో ఉన్నవారిని కూడా త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు. నిందితులను అరెస్టు చేసిన శాలిగౌరారం సిఐ కే. కొండల్ రెడ్డి, కేతేపల్లి ఎస్సై శివతేజ, టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ బాబు, ఎస్సైలు మహేందర్, మహేష్, సిబ్బంది ప్రభాకర్, కొండల్, లక్ష్మీ ప్రసాద్, శ్రీను, లింగరాజు, గిరిలను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-మిర్యాలగూడ



30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్టు రూరల్ ఎస్ఐ నరేశ్ తెలిపారు. బుధవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మండలంలోని కొత్తగూడెం గ్రామం వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా మిర్యాలగూడ వైపు నుండి ఆంధ్ర వైపుకు వెళుతున్న ఒక అశోక్ లేలాండ్ గూడ్స్ వాహనం టీఎస్ 08 డిపి టిఆర్ 5888 లో నిండా తెల్ల బస్తాలు కలిగి ఉండి దానిపైన టార్పాలిన్ కప్పబడి ఉండడంతో అనుమానంతో వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించారు. పోలీసులను చేసి ఆపకుండా వెళ్తుండగా వెంబడించి కొద్ది దూరంలో పట్టుకున్నారు. అందులో 60 తెల్ల బస్తాలలో 30 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం కలిగి ఉన్నట్టు గుర్తించి డ్రైవర్‌ను, అందులో గల మరో వ్యక్తిని విచారించారు. పెన్‌పహాడ్ మండలం నాగులపాటి అన్నారానికి చెందిన పిండిపూలు పర్వతాలు బియ్యంలోడ్ చేసి ఆంధ్రాలో నరసింహారావు అను వ్యాపారి వద్ద అన్లోడ్ చేయుటకు పంపిస్తే వెళుతున్నామని తెలిపారు. బియ్యం లోడును వాహన డ్రైవర్ కార్తీక్, వాహనంలో ఉన్న మరో వ్యక్తి గోపి, వాహన యజమాని పర్వతాలు, బియ్యం కొనుగోలు చేయు నరసింహారావులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మూడు నెలల కాలంలో 11 కేసులు నమోదు చేసి 330 క్వింటాళ్ల పిడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు.

పేదింటిలో వెల్లివిరిసిన ఆణిముత్యం



నవతెలంగాణ-కోదాడరూరల్

అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలో ఓ పేదింటి విద్యార్థి గొర్రెపాటి వినోద్ ఒకెసారి గ్రూప్-1 గ్రూప్-4 రెండిటిలో ఉత్తర్ణిత సాధించి సత్తా చాటాడు. గ్రూప్-1, గ్రూప్-4లో ఉత్తీర్ణత సాధిండం పట్ల గ్రామ ప్రజలు హర్షం వక్త్యం చేస్తూ తన తండ్రి చనిపోయినప్పటి నుండి కుటుంబ బాధ్యతలు చూసుకుంటా తన చెల్లికి పెళ్లి చేసి ఒక వైపు చదువుకుంటు ఈ విజయం సాధించటం పట్ల కుటుంబ సభ్యులు స్నేహితులు బంధువులు శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- మాజీ మంత్రి దామోదర్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అన్నారు. బీ ఆర్ ఎస్ నాయకులు పందిరి మల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ మాలి అనంతరెడ్డిలు బుధవారం స్థానిక వైట్ హౌస్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలలో అన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించే దిశగా పని చేయాలని కోరారు. కష్టపడ్డ ప్రతి ఒక్కరికి పదవులు లభిస్తాయని తెలిపారు. త్వరలో రైతు రుణ మాఫీ జరుగుతుందని అపుడు సంబురాలు జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొప్పుల వేణా రెడ్డి, బీరవోలు రవీందర్ రెడ్డి, కోతి గోపాల్ రెడ్డి,రామస్వామి శ్రీనివాస్ నాయుడు, ఆదిమల్ల కృష్ణ, కనుకు వెంకన్న, కట్టే నరేష్, చేరిన వారిలో జానయ్య నగేష్, శ్రీను, నాగరాజు, నాగయ్య, మహీన్ పాల్గొన్నారు.

నార్లు పోసి ఆకాశం వైపు చూస్తున్న రైతన్నలు

- వర్షాకాలం ప్రారంభమై రెండోనెల సమీపిస్తున్నా కానరాని వానలు
- చెదురుమొదులు జల్లులతో నిండని చెరువులు
- డెడ్ స్టోరేజీలోనే శ్రీశైలం, నాగార్జున సాగర్
- ప్రశ్నార్థకంగానే వరిసాగు
- భూగర్భజలాలతోనే కాలంఎల్లదీయడం కష్టమే అంటున్న రైతులు



నవతెలంగాణ-హుజూర్‌నగర్

వర్షాకాలం ప్రారంభమై రెండవ నెలకి సమీపిస్తున్నప్పటికీ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆశించిన రీతిలో వర్షాలు పడలేదు. లోటు వర్షపాతం నమోదు కావడంతో బావులు బోర్లు అండగా ఉన్న రైతులు నారుమల్లు దున్ని వారి నారు పోసి వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. సరైన వర్షాలు కురిస్తేనే చెరువులలోకి నీరువచ్చి భూగర్భ జలాలు పెరిగి వ్యవసాయ బావులలోకి బోర్లలోకి నీరు వచ్చి భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. జూలై నెల సగం పూర్తైనప్పటికీ సరియైన వర్షాలు కురువకపోవడంతో ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ముందస్తుగా వ్యవసాయ పనులకు ప్రారంభించిన రైతులు అత్యంత నిరాశకు గురవుతున్నారు. బావులు బోర్ల కింద పోసిన వరి నారు మరో పది రోజుల్లో నాట్లు వేయడానికి అనుగుణంగా నారు పెరుగుతుండటంతో రైతులు ఆశగా వర్షాల కోసం ఆకాశం వైపు చూస్తున్నారు. ముఖ్యంగా సాగర్ ఆయకట్టు పరిధిలో 3.5 లక్షల ఎకరాల సాగు ప్రశ్నార్థకంగా మారుతోంది. ముఖ్యంగా ఎడమ కాల పరిధిలో నాగార్జునసాగర్ నీటి విడుదల పైన వ్యవసాయం ఆధారపడి ఉంటుంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణం నుండి నేటి వరకు కూడా సాగర్ నీటి విడుదలపై ఆధారపడే వ్యవసాయాలు చేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా సాగర్ ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో నీరు రాకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలో చిక్కుకుంది. గత ఖరీఫ్‌లోను మరియు రబీ సీజన్లో కూడా సాగర్‌లోకి నీరు రాక విడుదల చేయలేదు. దీంతో వరి సేధ్యం 25 నుండి 30 శాతానికి పడిపోయింది. రైతులు బావులు, బోర్ల కింద వ్యవసాయం సేధ్యం చేసినప్పటికీ పంట చేతికి వచ్చే సమయానికి సక్రమంగా నీరు దొరకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు నష్టాలను చూడవలసిన పరిస్థితి వచ్చింది. గత సంవత్సరం నుండి సాగర్ నీరు రాకపోవడంతో లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయకపోవడంతో రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికీ కృష్ణా పరివాహక ప్రాంతంలో సకాలంలో కురవాల్సిన వర్షాలు కురువక నాగార్జునసాగర్, శ్రీశైలంలో ప్రాజెక్టులలో నీరు డెడ్ స్టోరేజీలోనే ఉన్నాయి. దీంతో సాగర్ ఆయకట్టు పరిధిలో వరి సేధ్యం చేస్తున్న రైతుల ఆశలు మరింత సన్నగిల్లతున్నాయి. ప్రభుత్వం వ్యవసాయ శాఖ వారు సాగరాయకట్టు పరిధిలో వర్షాలు కురువనటువంటి సమయాలలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఉమ్మడిగా ప్రణాళికను సిద్ధం చేసుకుని నాగార్జునసాగర్ మరియు ఇతర ప్రాజెక్టుల కింద ఉన్న రైతులకు మెట్ట పంటల వర్షాధరిత పంటల సేద్యంపై అవగాహన శిక్షణా తరగతులు నిర్వహించి మెట్ట పంటలు రైతులు వేసుకొని లబ్ధి పొందే లాగా ప్రోత్సహించి రైతుల్లో అవగాహన తీసుకురావాలి. లేనట్లయితే రైతులు ఖరీఫ్ సీజన్ మొత్తం కూడా వర్షాల కోసం ఎదురు చూసి వర్షాలు రాక పంటలు వేయక నష్టాలను ఎదురుకోవలసి వస్తుంది. ఒకవేళ వర్షాలు కురిసి ప్రాజెక్టులోకి నీరు వచ్చినట్లయితే ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండినట్లయితే వరి సేధ్యం చేసుకోవచ్చు. ప్రాజెక్టులోకి ఆశించిన నీరు రాకపోయినట్లయితే ఆరు తడి పంటలకు నీటిని విడుదల చేసి మెట్ట పంటలు వేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించి రైతులలో చైతన్యం తీసుకురావాలి. అప్పుడే ఆయకట్టు రైతులు లబ్ధి పొంది ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడే అవకాశాలున్నాయి. సాగర్ ప్రాజెక్టులోకి నీరు రాకపోయినట్లయితే ఈ దిశగా ప్రభుత్వం పనిచేయాల్సి ఉంది.

సకాలంలో వర్షాలు పడి రైతులంతా సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీమంత్రి దామోదర్ రెడ్డి
- ఘనంగా తొలి ఏకాదశి పూజలు



నవతెలంగాణ-సూర్యాపేట

సకాలంలో వర్షాలు పడి రైతులంతా సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్లు మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా బుధవారం స్థానిక తహసిల్దార్ రోడ్డులోని శ్రీ విశ్వనాథ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలకు ఈ సంవత్సరం మంచిగా కలిసి రావాలని కోరారు.

పలు దేవాలయాల్లో పూజలు...

ఉగాది తర్వాత వచ్చే పండుగలలో మొదటి పండగ అయిన తొలి ఏకాదశి వేడుకలను జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషి మాత దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాంబశివ స్వామి వారికి పంచామృతములతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు భక్తులు స్వయంగా స్వామివారి గర్భగుడిలోకి ప్రవేశించి తమ అస్వహస్తాలతో అభిషేకం చేసుకునే విధంగా ఏర్పాటు చేశారు. తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా సామూహికంగా శ్రీ రమ సహిత సత్యనారాయణ స్వామి వ్రతాన్ని నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, సాయిబాబా దేవాలయంలో భక్తులు తెల్లవారి నుండి పోటెత్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా దేవాలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు సోమ శ్రీశైలం, దేవర్శెట్టి సోమయ్య, యామా వెంకటేశ్వర్లు, బ్రాహ్మణపల్లి దేవి దత్తు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య కనక రత్నం, జగదీశ్వరి దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



రాష్ట్ర స్థాయి సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మేడి పాపయ్య ఆదేశాల మేరకు జిల్లా ఇంచార్జ్ పడిదల రవి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక పబ్లిక్ క్లబ్ లో జరిగిన జిల్లా స్థాయి ముఖ్య కార్యకర్తల సమేశం లో వారు మాట్లాడుతు జులై రేపు యాదాద్రి లక్కీ ఫంక్షన్ హల్ లో జరిగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సు కు జిల్లా నలు మూలల నుండి మాదిగ లు మాదిగ ఉపకులాల నుండి అధిక సంఖ్య లో పాల్గొని సదస్సు ను జయప్రదం చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కనుక జానయ్య గౌరవ అధ్యక్షులు దుబ్బ రమేష్ చింత సైదులు నాగరాజు భరత్ రాజేష్ వినోద్ కందుల పవన్ మహేందర్ తమన్ ప్రవీణ్ పర్షి చింటూ నాని తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు

- మండల వ్యవసాయ శాఖ అధికారి బాలకృష్ణ

నవతెలంగాణ-తుంగతుర్తి

రాష్ట్ర ప్రభుత్వం నేడు రైతుల రుణమాఫీ చేస్తున్న సందర్భంగా మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలోని రైతు వేదికలో రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ తెలిపారు.నేడు లక్ష లోపు రైతుల రుణమాఫీ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులు అధిక సంఖ్యలో రైతు వేదికలో పాల్గొని సంబరాలు నిర్వహించుకోవాలని కోరారు.

బకాయి వేతనాలు విడుదల చేయడం పట్ల హర్షం

నవతెలంగాణ-మోతే

గ్రామపంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామ పంచాయతీ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిట్యాల రవిచంద్ర బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు గత ఆరు నెలల నుండి కొన్ని గ్రామపంచాయతీలో 10 నెలల నుండి వేతనాలు విడుదల గాక ఎంతో వేదన చెందుతున్నారని పేర్కొన్నారు .సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రాల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నాలు చేసిన ఫలితంగా వేతనాలు మంజూరు చేశారని పేర్కొన్నారు కార్మికులకు 2600 కనీస వేతనము ఇవ్వాలని డిమాండ్ చేశారు కార్మికులు మృతి చెందితే 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

త్యాగానికి ప్రతీక మొహర్రం

నవతెలంగాణ-పెన్‌పహాడ్



మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని వివిధ గ్రామాలలో మొహర్రం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసైదులా హారతి కాళ్ళ గజ్జెల గమ్మతి అంటూ పాటల నడుమన గ్రామాల వీధులలో పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా మండలంలోని అనంతారం గ్రామంలో నిర్వహించిన ముస్లిం మైనార్టీ అధ్యక్షులు షేక్ మస్తాన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ముజావర్ సోను, లతీఫ్, చాందు మైబెల్లి,షఫీ సాజిద్, సైదులు, బాజీ, సొందు, సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో మహిళ మృతి

నవతెలంగాణ-తుంగతుర్తి



ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సంగెం గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఏశమల్ల జయమ్మ (54) ఉదయం ఇంటి వెనకాల ఉన్న మోటర్ పనిచేయ కపోవడంతో దాన్ని సరి చేసే క్రమంలో విద్యుత్ షాక్కు గురై అక్కడికక్కడే మరణించింది. మృతురాలి కూతురు బండ్ల మహేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఏరియాకు ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నరేష్ కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-తిరుమలగిరి

తెలంగాణ ఉద్యమ కళాకారుడు వేముల నరేష్ అకాల మరణం చెందడం తో ఆ కుటుంబాన్ని పరామర్శించి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి నరేష్ కుటుంబానికి రూ.10000 ఆర్థిక సహాయాన్ని అందజేసిన తెలంగాణ ఉద్యమ గాయకుడు మద్దెల సందీప్ ఈ కార్యక్రమంలో వారితోపాటు తెలంగాణ ఉద్యమ సినీ గేయ రచయిత గాయకులు మానుకోట ప్రసాద్, పాలకుర్తి శ్రీకాంత్, గడ్డం సంతోష్, గడ్డం ఉదయ్, పాక ఉపేందర్, బోనాల నరేందర్, గంటా బిక్షపతి, ఇతర కవులు,కళాకారులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలని నిరసన



నవతెలంగాణ-హుజూర్‌నగర్

ముత్యాల బ్రాంచ్ కెనాల్ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ప్రజా కళాకారుడు బాదే నరసయ్య ఓయూ జేఏసీ నాయకుడు తెలంగాణ మలదశ ఉద్యమ నాయకుడు సోమగాని నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై కూర్చొని నల్ల బ్యాడ్జీ కట్టుకొని నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మెగా కంపెనీ వారి అనుబంధ కంపెనీల సబ్ కాంట్రాక్టర్లు చేస్తున్న ముక్తాల బ్రాంచ్ కెనాల్ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదన్నారు. నీటిపారుదల శాఖ అధికారులు క్వాలిటీ కంట్రోల్ అధికారులు ఈ పనులపై నాణ్యత పరీక్షలను నిర్వహించారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ వద్ద మూడు పిల్లర్ కుంగిపోవడానికి కారణమైన మెగా కంపెనీకి వారి అనుబంధ కంపెనీలకు ముక్యాల బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను కాంట్రాక్టర్లను అప్పగించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. మెగా కంపెనీ సబ్ కాంట్రాక్టర్లు చేస్తున్న పనులలో పూర్తిగా నాణ్యతగా ప్రమాణాలను విస్మరించారని, దీనివల్ల ప్రజాధనం దుర్వినియోగమే కాకుండా కాలువ పనుల లక్ష్యం నెరవేరదన్నారు. ఈ విషయం నీటపారుదల శాఖ అధికారుల దృష్టికి పలమార్లు తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. దీనివల్ల అవినీతి పనులలో అధికారులు కూడా వాటా ఉన్నదేమో అని అనుమానించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యత పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో లింగం కృష్ణ రేఖ సైదులు సోమ గాని నాగేశ్వరరావు సైదులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయం పట్ల ఆర్ఎంపీ, పీఎంపీల హర్షం

నవతెలంగాణ-హుజూర్‌నగర్



ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులకు శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వడానికి అధికారులు అధ్యయనం చేయాలంటూ సీఎం తీసుకున్న నిర్ణయం పట్ల ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మన్సూర్ అలీ హర్షం వ్యక్తం చేశారు. హుజూర్నగర్ డివిజన్ ఆర్ఎంపి, పిఎంపీ గ్రామీణ వైద్యుల సమావేశం ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు మన్సూర్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ఎన్నికల ముందు ముఖ్యమంత్రి ఆర్ఎంపి పిఎంపి గ్రామీణ వైద్యులకు ఇచ్చిన హామీ మేరకు 16న రాష్ట్ర సచివాలయంలో జరిగిన కలెక్టర్ల, ఎస్పీల, మంత్రుల సమావేశంలో సీఎం మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి సర్టిఫికేట్లు ఇవ్వడానికి అధ్యయనం చేయాలన్నారు. సీఎం నిర్ణయం పట్ల ఆర్ఎంపి ఎపీలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి సన్నిధి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎస్ మదనాచారి, కోశాధికారి ఏ శ్రీనివాస్, షేక్ మీరా, సీతారాములు, శ్రీధర్ టి రమేష్, టి మానియల్, ఎస్ సైదులు, తదితరులు పాల్గొన్నారు.

పేటను పర్యాటక రంగంగా అభివృద్ధి చేస్తా

- అభివృద్ధికి 61 కోట్లు ఎస్టిమేషన్
- పటేల్ రమేష్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

పట్టణాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. ఆరెగూడెం , దాస్ తండా కు చెందిన వివిధ పార్టీల నాయకులు పులగం వెంకట్రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆయన నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం లో భాగంగానే చేరికలని స్పష్టం చేశారు. రానున్న స్థానిక ఎన్నికల్లోను కాంగ్రెస్దే గెలుపు ఖాయమని పేర్కొన్నారు. ఇంజనీర్ల బృందంతో ఇప్పటికే సూర్యాపేట అభివృద్ధిపై ప్రణాళిక రూపొందించడం జరిగిందని పేట అభివృద్ధికి 61 కోట్లు ఎస్టిమేషన్ రూపొందించామన్నారు. అంతేకాకుండా పిల్లలమర్రి, మూసి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించి పర్యాటక కేంద్రాలుగా మారుస్తానని తెలిపారు.బిఆర్ఎస్ మునిగిపోయిన పడవ అని కాళేశ్వరం మాదిరిగా కుంగిపోయిందని ఇప్పుడో అప్పుడో కొట్టుకపోవడం ఖాయమన్నారు . సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేసేలా కృషి చేస్తున్నానని వివరించారు. సూర్యాపేటలో మూడు సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల్లోనే ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందని, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులను అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ లక్ష్యమని, అందులో భాగంగానే రెండు లక్షల రుణమాఫి చేస్తునట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముదిరెడ్డి రమణ రెడ్డి, డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్,కౌన్సిలర్ లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, సీనియర్ నాయకులు గట్టు శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, నిమ్మల వెంకన్న, ఫరూక్, రమేష్ , ధర్మా నాయక్, దేవేందర్, తండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేసిన రేవంత్ ప్రభుత్వం

నవతెలంగాణ-అర్వపల్లి



రూ.2లక్షల రుణమాఫీకి కొర్రీలు పెడుతూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మాజీ జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ అన్నారు. బుధవారం అర్వపల్లి మండల కేంద్రంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణం తీసుకున్న రైతులందరికీ ఏక కాలంలో రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన సీఎం ఇప్పుడు రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధన పెట్టడం వల్ల కార్డులు లేని రైతులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. షరతులు లేకుండా పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగానే రుణమాఫీ చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ప్రజాపోరాటాలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి హెచ్చరికలు చేసారు.ఈ కార్యక్రమంలో నాయకులు కదారి నరేష్, బైరబోయిన పెద్దయ్య, మామిడాల రాజలింగం, అరిగె నాగరాజు, బైరబోయిన వెంకన్న, దావుల లింగయ్య,కొమారి నాగరాజు, అంకిరెడ్డి వెంకన్న, కేలోతు రవీందర్ నాయక్, దావుల నాగరాజు, ప్రసాద్, ఆకారపు శ్రీను, అంకిరెడ్డి సందీప్, బింగి సాయి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-సూర్యాపేట కలెక్టరేట్



రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని సీపీఐఎంఎల్‌మాస్ లైన్ పార్టీ సూర్యాపేట డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేటలోని లెనిన్ నగర్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలక్షన్లకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చిఅధికారంలోకి వచ్చాక వివిధ శాఖల తోటి ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. అందులో భాగంగానే రైతు రుణమాఫీ కాడికి వచ్చేసరికి రేషన్ కార్డు చూపుతుందన్నారు. ఇది సరైన విధానం కాదని అన్నారు. ఎలాంటి షరతులు లేకుండా రేషన్ కార్డు ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెండు లక్షల రూపాయల వరకు ఉన్న రుణాలను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షులు మారసాని చంద్రకళ, ఉపాధ్యక్షులు సూరం రేణుక, పార్టీ పట్టణ అధ్యక్షులు గులాం ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు వాజీద్, పార్టీ నాయకులు ఎల్లన్న సురేషు మహేష్ పి ఓ డబ్ల్యు కోశాధికారి జయమ్మ , జానయ్య, బాజీ ,పద్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

పిల్లలమర్రిలో తొలి ఏకాదశి పూజలు

- ప్రత్యేక అలంకరణలో లక్ష్మి చెన్నకేశవ స్వామి



నవతెలంగాణ-సూర్యాపేట రూరల్

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవస్థానం నందు బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంవత్సరంలో తొలి పండగ ప్రారంభం సందర్భంగా ఆలయంలో ఉన్నటువంటి దేవతామూర్తులకు అభిషేకం నిర్వహించి తదుపరి ప్రత్యేక అలంకారణలో భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ తొలి ఏకాదశి పర్వదినం నాడు ప్రాతకాలమే తలస్నానం ఆచరించి తదుపరి ఆలయ దర్శనం చేసుకోవాలని ముఖ్యంగా విష్ణుమూర్తిని లక్ష్మీదేవి ఆరాధించాలని తద్వారా సకల ఇష్ట కామ్యార్థసిద్ధి కలుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గూకంటి రాజబాబురెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తొగర్రాయి చెరువు భూమి కబ్జా !

నవతెలంగాణ-కోదాడరూరల్



మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలోనీ చెరువు సుమారు 20ఎకరాలకు పైగా కబ్జాకు గురైంది అని సంతాన వేణుగోపాలస్వామి దేవాలయ చైర్మెన్ అమరనాయిని వెంకటేశ్వరరావు ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని తొగర్రాయి గ్రామంలో ఆయన నివాసంలో చెరువు సంఘ సభ్యులతో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాకతీయుల కాలంలో గ్రామంలో 9 కుంటలు ఉన్నాయని, కాల క్రమేనా 8 కుంటలు ఆక్రమణకు గురికాగా వున్న ఒకే ఒక కుంట ప్రస్తుతం వున్న చెరువు అన్నారు. అది కొంత భాగం చిలుకూరు మండల పరిధిలో వుంది. 642 సర్వే నెంబర్‌లో 54 ఎకరాల 12 కుంటల భూమి వుండాలి దానిలో 20ఎకరాలకు పై గా ఆక్రమణకు గురి అయింది అన్నారు. శిఖం భూములు మొత్తం కబ్జా చేస్తూ చెరువు మొత్తం కబ్జా చేస్తున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి చెరువులు కబ్జా కాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు కన్నెబోయిన కొండలు, ముదిరాజ్ గ్రామ శాఖ ముఖ్యులు కన్నెబోయిన వీరయ్య, కన్నబోయిన సత్యనారాయణ, కన్నబోయిన ఏడుకొండలు, కన్నెబోయిన సింగర్ అయ్యా, కన్నబోయిన ఉపేందర్, కన్నబోయిన సత్యం, కన్నబోయిన గాంధీ, కన్నెబోయిన నాగి పాల్గొన్నారు.

బొల్లెపల్లి శ్రీరంగం మృతి

నవతెలంగాణ-నూతనకల్



మండల పరిధిలోని బికుమాళ్ళ గ్రామ మాజీ సర్పంచ్ తండ్రి బొల్లెపల్లి శ్రీరంగం బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు మండల కేంద్రానికి చెందిన ఎంపీటీసీ పన్నాల రామమల్లారెడ్డి మృతుని మృతదేహంపై పుష్పగుచ్చ నుంచి శ్రద్ధాంజలి ఘటించి ఘన నివాళు లర్పించారు మృతునికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ సర్పంచ్ కొమ్ము నాగేశ్వరరావు భద్రాచలం కనకం వెంకన్న సురిగి ఉప్పలయ్య బద్రి తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-మునగాల



గ్రామాల్లో పారిశుద్యం కోసం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త గంధం సైదులు కోరారు. బుధవారం మండల కేంద్రంలో అపరిశుభ్రంగావున్న పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పలు వీధుల్లో గుంతలుపడి మురికి నీరు నిల్వ ఉంటుందని గుర్తుచేశారు. డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. వాటర్ ట్యాంకుల్లో గ్రామపంచాయతీ సిబ్బంది తరచూ క్లోరినేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇళ్ళ పరిసరాల ను పరిశుభ్రం గా వుంచుకోవాలి కోరారు. టైర్లు, ట్యూబ్‌లు, పిచ్చి మొక్కలపై నీరు నిల్వ వుండటంతో దోమలు వ్యాప్తి చెందుతాయని చెప్పారు. వర్షాకాలంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని కోరారు.

రైతు వేదికల పరిశీలన

- నేడు రైతు రుణమాఫీ పత్రాలు పంపిణీ
- పాల్గొననున్న ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్, ఆర్డీవో కిషోర్ కుమార్



నవతెలంగాణ-కోదాడరూరల్

రైతు రుణమాఫీ పత్రాల పంపిణీ వేడుక కోసం డివిజన్ పరిధిలోని రైతు వేదికలను ఆర్డిఓ సూర్యనారాయణ బుధవారం పరిశీలించారు. కోదాడ మండలం కాపుగల్లు రైతు వేదికలో, అనంతగిరి మండలం త్రిపురవరం రైతు వేదికలో, చిలుకూరు మునగాల నడిగూడెం మండల కేంద్రాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పత్రాల పంపిణీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే పద్మావతి ఉత్తమ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ వేడుకల కార్యక్రమానికి రైతులు మాజీ ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

కుక్కల దాడితో దూడ మృతి

నవతెలంగాణ-బొమ్మలరామారం



కుక్కలు దాడితో ఓ దూడ మృతి చెందిన ఘటన మండలంలోని మర్యాల గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మర్యాల గ్రామానికి చెందిన ఈదులకంటి రాజు రెడ్డి ఉదయాన్నే పొలం వద్దకు వెళ్లగా కుక్కలు దూడపై దాడి చేసి తినడం చూసి కుక్కల తరిమికొట్టగా దూడ అప్పటికి మృతి చెందిందని చుట్టుపక్కల కోళ్ల ఫారంలు ఉండడంతో చనిపోయిన కోళ్లను, వాటి వ్యర్థాలను చుట్టుపక్కల పడేయడంతో కుక్కలు విచ్చలవిడిగా తిరిగి చనిపోయిన కోళ్లను తింటున్నాయి. కోళ్ల ఫారంలో కోళ్లు లేని సమయంలో ఇలా దూడలను తినడం మొదలు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తారు. ఎన్నిసార్లు కోళ్ల ఫారం యజమానానికి చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని కోళ్ల ఫారం యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని చనిపోయిన దూడకి నష్టపరిహారం చెల్లించాలని కోరారు.


మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-రామన్నపేట



మండలంలోని భోగారం గ్రామంలో కూనూరు లక్ష్మయ్య మృతి చెందడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కూనూరు సాయికుమార్ గౌడ్ బుధవారం లక్ష్మయ్య భౌతిక కాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గోగుసత్తయ్య యాదవ్, కునూరు నరేష్ గౌడ్, కూనూరు రాజు, నేరటి రమేష్, కూనూరు వెంకటేష్, కూనూరు నరేష్, బైకానీ నరేష్, జేల్లా శ్రీనివాస్, తదితర నాయకులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అయ్యేనా..!



- ప్రామాణికం రేషన్ కార్డా ? పాస్‌బుక్కా?
- ప్రభుత్వ భిన్న ప్రకటనలతో.. సందిగ్ధంలో రైతులు
- రేషన్ కార్డు లేని రుణం తీసుకున్న రైతులు 6.36 లక్షలు

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రూ.2 లక్షల రుణమాఫీ రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ వర్తించేనా ? అని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నూతనంగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఒకసారి రేషన్ కార్డు ఉన్న వారికే రుణమాఫీ అని, మరోమారు పాసుబుక్ ఉన్న రైతుల కుటుంబానికే రుణమాఫీ అని, బంగారు రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ వర్తించదని ప్రకటించడంతో రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు విడుదల చేసిన ప్రభుత్వం 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 మధ్య కాలంలో రైతులు తీసుకున్న రుణాలకు ఈ పథకం వర్తింపజేస్తామని, మొదట రైతు రుణమాఫీకి రేషన్ కార్డును తప్పనిసరి అని చెప్పిన ప్రభుత్వం ప్రతిపక్షాల నుంచి విమర్శలు ఎదురయ్యే సరికి రైతు రుణమాఫీకి రేషన్ కార్డు ప్రామాణికం కాదని పాస్‌బుక్ ఉన్న రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని మరో మాట చెప్పింది. దీంతో రైతులకు పలు అనుమానాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్నికల ముందు కాంగ్రెస్ వరి ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ చెల్లిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక సన్న రకం వడ్లకే బోనస్ చెల్లిస్తామని మాట మార్చినట్టే రుణమాఫీ విషయంలో మాట మార్చదనే గ్యారెంటీ ఏంటి అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్రంలో 90 లక్షల వరకు రేషన్ కార్డులు ఉండగా రుణాలు తీసుకున్న రైతులు ఖాతాల సంఖ్య 70 లక్షల వరకే ఉన్నాయని ప్రభుత్వం చెప్తోంది. రేషన్ కార్డులు లేని 6.36 లక్షల మంది రైతులకు రుణాలు ఉన్నాయని వారికి రుణమాఫీ వర్తిస్తుందని, రేషన్ కార్డులు లేనంత మాత్రాన ఆ రైతులకు అన్యాయం చేయబోమని స్వయానా ముఖ్యమంత్రి ప్రకటించారు. ప్రభుత్వ ద్వంద ప్రకటనల వల్ల క్షేత్రస్థాయిలో రైతులల్లో పలు అనుమానాలు నెలకొన్నాయి. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులు కుటుంబాలు ఉన్నాయని రెండు లక్షల రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమని ప్రభుత్వం లెక్కలు చెబుతోంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 లక్షల మందికి పైగా రైతులు ఉన్నప్పటికీ 9 లక్షల మంది రైతులకు పైగా అప్పులు తీసుకున్నట్లు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 10,07,797 మంది కుటుంబాలకు రేషన్ కార్డులు ఉన్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో 2,71,590 మంది రైతులు ఉండగా 2,16,945 తెల్ల రేషన్ కలిగిన కుటుంబాలు ఉన్నాయి. ఇందులో భూమిలేని నిరుపేదలు అనేకమంది ఉన్నారు. రేషన్ కార్డుల సంఖ్య కంటే రైతుల సంఖ్య చూసినట్లయితే 50 వేల పైన ఎక్కువగా కనిపిస్తుంది.రేషన్ కార్డు ప్రామాణికమైతే యాదాద్రి భువన గారి జిల్లాలో 50 నుంచి 60 వేల మంది రైతులకు రైతు రుణమాఫీ వర్తించకుండా పోయే ప్రమాదం ఉంది. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదు. అనేకమంది రైతులకు పాసుబుక్కులు ఉన్నప్పటికీ రేషన్ కార్డులు లేని పరిస్థితి దాపురించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల మాదిరిగానే రుణమాఫీ పథకాలు ఉందా అని చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం ఈ రుణమాఫీ స్వల్పకాలిక పంటల రుణాలకు వర్తించనుందని స్పష్టం చేసింది.

మార్గదర్శకాలను బట్టి రాష్ట్రంలో ఉన్న రైతుల్లో అర్హులైన లబ్దిదారులను ప్రభుత్వం ఎంపిక చేయనుంది. నేటి నుండి రైతుల ఖాతాలో లక్ష జమ చేయనున్నట్టు తెలుస్తుంది. అర్హతగల రుణ మాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్దిదారులు రైతు రుణఖాతాలకు జమచేయనున్నారు. పీఏసీఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ లేదా బ్యాంకు బ్రాంచ్‌కు విడుదల చేయడమవుతుంది. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పీఏసీఎస్‌లో ఉన్న రైతు ఖాతాలో జమచేస్తారు. ఏ కుటుంబానికి అయితే 2 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు 2 లక్షలకు పైబడివున్న రుణాన్ని మొదట బ్యాంకుకు చెల్లించాలి. ఆ తరువాత.. అర్హత గల 2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేసి, మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేయాల్సింది.



కృష్ణా గోదావరి జలాల సాధనకు 20న చర్చా గోష్ఠి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

నవతెలంగాణ-భువనగిరి అర్బన్

యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా భువనగిరి, పోచంపల్లి, బీబీనగర్, వలిగొండ, రామన్నపేట, మోత్కూరు, ఆత్మకూరు, అడ్డగూడూరు మండలాలకు రైతాంగానికి లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్న మూసీని ప్రక్షాళన చేసి ప్రత్యామ్నాయంగా కృష్ణా, గోదావరి జలాలను అందించాలని ఈనెల 20వ తేదీన సీపీఐ(ఎం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరుగు చర్చా గోష్ఠిని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రవహిస్తున్న పరివాహక ప్రాంతాలకు సాగునీరు అందిస్తున్న మూసీ నదికి నమామిగంగా తరహాలో బడ్జెట్ కేటాయించి మూసీ నీటిని శుద్ధి చేసి రైతాంగానికి సాగునీరు అందించే ప్రయత్నం చేయడంలో పాలకులు విఫలం అయ్యారు అని వారు అన్నారు. బస్వాపురం ప్రాజెక్టు ద్వారా గోదావరి, కృష్ణా జలాలను జిల్లాకు అందించాలని, మూసి శుద్దీకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని వారు కోరారు. మూసీ జల కాలుష్యంతో ఇప్పటికే ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అంతుచిక్కని రోగాలతో ప్రజల ఆరోగ్యాలు పాడు అవుతున్నాయని పాలకుల పుణ్యమా అని ప్రభుత్వాలు మారుతున్న పాలకులు మారుతున్న మూసీ మాత్రం, మూసి కింద జీవనం సాగిస్తున్న బ్రతుకుచిత్రం మాత్రం మారడం లేదని వారు అన్నారు. ఎన్నికల సమయంలో బూటకపు వాగ్దానాలు చేసి ప్రజలను మోసం చేస్తున్నారు అని వారు అన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 20న సుందరయ్య భవనంలో మూసీ ప్రక్షాళన - కృష్ణా గోదావరి జలాల సాధన అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహిస్తున్నామని ఈ చర్చ గోష్ఠికి ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా కిసాన్ సంఘం జాతీయ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు.మూసి పరివాహక ప్రాంత రైతాంగం, మేధావులు, ప్రజాప్రతినిధులు పాల్గొని చర్చ గోష్ఠిని జయప్రదం చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, జిల్లా కమిటి సభ్యులు దయ్యాల నరసింహ, మాయ కృష్ణ, గడ్డం వెంకటేష్, నాయకులు ముత్యాలు, లావుడ్య రాజు, రాంబాబు, శివ పాల్గొన్నారు.



రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం

పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-యాదగిరిగుట్ట రూరల్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క చిత్రపటాలకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఇతర నాయకులతో కలసి బుధవారం ప్రజాభవన్‌లో పాల అభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో తెలిపినట్లుగానే తెలంగాణ రాష్ట్రంలో రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క సమక్షంలో నిర్వహించిన ముఖ్య నేతల సమావేశం అనంతరం రేవంత్ రెడ్డి, బట్టి విక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేసారు. ఈ సందర్భంగా రైతుల అందరి తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ట భూమి పూజ

నవతెలంగాణ-భువనగిరి

శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో శ్రీ ఆంజనేయ స్వామి 21 ఫీట్ల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి బుధవారం విగ్రహ దాత ఊటుకూరి నాగమణి భాస్కర్‌ల చేతుల మీదుగా భూమి పూజ చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మెన్ ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మెన్ తాడురు చంద్రయ్య దొంత లక్ష్మణ్ తాడురు కృష్ణయ్య ఆలయ మాజీ చైర్మన్ తాడేం రాజశేఖర్ స్థానిక కౌన్సిలర్ వడిచెర్ల లక్ష్మీ కృష్ణ మల్లికార్జున్ సంతోష్ కుమార్ మాజీ కౌన్సిలర్స్ తాడూరు బిక్షపతి పాల్గొన్నారు.

19న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సు

నవతెలంగాణ-భువనగిరి

యాదగిరిగుట్టలో ఈనెల 19వ తేదీన నిర్వహించే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సును మాదిగ, ఉపకులాల ప్రజలు జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి ఋషి మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పార్లమెంటు సమావేశాలలోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఎస్సి వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. ఏబిసిడి వర్గీకరణ చేయకుండా మోసం చేస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం జరిగే రాష్ట్ర మహాసదస్సును విజయవంతం చేయడానికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దేవాలయాల్లో తొలి ఏకాదశి సందడి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

శ్రీ మార్కండేశ్వర స్వామి దేవాలయంలో లక్ష్మీనారాయణ స్వామి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు వ్రతములు నిర్వహించారు. భక్తులు ఆధ్యాత్మిక భావాలను పెంపొందించుకోవాలని మార్కండేయ స్వామి దేవాలయం చైర్మన్ ధర్మకర్త మండలి సభ్యులు లక్ష్మీనారాయణ స్వామి దేవాలయం చైర్మన్ అంకం వినోద్ ధర్మకర్త సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

'ఫిలింసిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నాం'

నవతెలంగాణ-సంస్థాన్ నారాయణపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి రాచకొండలో ఫిలింసిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయాన్ని స్వాగతీస్తున్నామని మాజీ సర్పంచ్ వగ్గు గణేష్ తెలిపారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ హామీఇచ్చి అమలు పరచలేదన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టులస్కరిగూడెం గ్రామంలో గౌడన్నలకు కాటమయ్య సేఫ్టీ క్రికెట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రాచకొండలో ఫిలింసిటీ ఏర్పాటు చేస్తానని ప్రకటించడం హర్షించదగ్గ విషయమన్నారు. రాచకొండలో ఫిలింసిటీ, పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసినట్లయితే ఈ ప్రాంత ప్రజలు జీవనోపాధి పొందుతారున్నారు. ఫిలింసిటీతో పాటు పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా మార్చాలన్నారు.

రామచంద్రారెడ్డి జయంతి ఉత్సవాలు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

వెదిరే రామచంద్రారెడ్డి 119వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిలర్ మోటే రజిత రాజు విగ్రహానికి పూలమాలవేసి ఈ సందర్భంగా మాట్లాడుతూ రామచంద్రారెడ్డి పేద ప్రజల కోసం 100 ఎకరాల భూమి దానంచేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా భూదానం ద్వారా దేశ చరిత్రలోనే పోచంపల్లి నిలిచిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో కోయడ నరసింహ, వేషాల మురళి, గుడిగంటి మల్లేశం, కటుకూరి పాండు, చేరాల నరసింహ, చీరాల బుచ్చయ్య పాల్గొన్నారు.

షరతుల్లేని రుణమాఫీ వర్తింపజేయాలి

నవతెలంగాణ-సవస్థాన్ నారాయణపురం



షరతులు లేని రుణమాఫీని రైతులకు వర్తింపజేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బండ శ్రీశైలం ప్రభుత్వాన్ని బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ప్రకటించిన విధంగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీని ఒకే దఫాలో అమలు చేయాలని, ఎట్లాంటి షరతులు లేకుండా పథకం అమలు చేయాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని యాదాద్రి భువనగిరి జిల్లాలో 43,157 మంది రైతులు రూ.152 కోట్లు అప్పులు తీసుకున్నారని, సూర్యాపేట జిల్లాలో 20747 మంది రైతులు రూ.64 వేల కోట్లు, నల్గొండ జిల్లాలో 29,800 మంది రైతులు 120 కోట్లు అప్పులు తీసుకున్నారని తెలిపారు. సాగు చేస్తున్న రైతులందరికీ రుణమాఫీ లబ్ధిచేకూరేటట్లు చూడాలన్నారు. 2018 జూన్ నెల ఖరీఫ్ సీజన్ నుండి 2023 జూన్ ఖరీఫ్ సీజన్ వరకు రైతుల తీసుకున్న పంట రుణాలను ఈ పథకంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పండ్ల తోట సాగు చేస్తున్న రైతులకూ ఈ పథకం వర్తింపచేయాలన్నారు.

సమస్యల పరిష్కారంలో మున్సిపల్ పాలకవర్గం విఫలం



- సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు పట్టణంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఆలేరు మున్సిపల్ పాలకవర్గం విఫలమైందని, అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువ నిర్మాణం కోసం ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నిధులు వెచ్చించి సమస్యను పరిష్కరించాలని సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి ఎంఏ ఇక్బాల్ అన్నారు. సీపీఐ(ఎం) పోరుబాటలో భాగంగా ఆలేరు మున్సిపాలిటీలోని శివాలయం నుండి ఆయిల్ మిల్ రైస్ మిల్ వరకు ఉన్నటువంటి మురుగు కాలువను సీపీఐ(ఎం) బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలోని మురుగు కాలువలు దాదాపు 30 సంవత్సరాలు పూర్వం నిర్మాణం జరిగాయని, అవి చాలా చోట్ల శిథిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మానం చేయకపోవడం వలన ఎక్కడికక్కడ కూలిపోయి మట్టితో కప్పబడ్డాయని చెప్పారు. శివాలయం నుండి ఆయిల్ మిల్ వరకు ప్రధాన కాలువ నిండిపోవడం వలన సుభాష్‌నగర్‌లోని మహాలక్ష్మి రైస్ మిల్ కటిక బస్తీ, పాత ఎమ్మార్వో కార్యాలయం వీధులలో మురుగు కాలువలు ఎక్కడికి అక్కడ నిండిపోయాయని పేర్కొన్నారు. మురుగు నీరు ఇండ్లలోకి చేరి ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని, దోమలు, దుర్గంధం తో రోగాల బారిన పడుతున్నారని అన్నారు. పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ కంటి చూపు చర్యగా అరా కొర సిబ్బందితో పూడిక తీయడం వలన ఎలాంటి ప్రయోజనం లేదని చెప్పారు. మురుగు కాలువల నిర్మాణం కోసం ఎన్నిసార్లు పాలకవర్గం అధికారులను మొరపెట్టుకున్న నిధులు లేవని తప్పించుకుంటున్నారని, పాలకవర్గం ప్రజల సమస్యను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైనారని అన్నారు. ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య స్పందించి మురుగు కాలువ నిర్మాణం కోసం తమ నిధులను కేటాయించి ,అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎం) బృందం డిమాండ్ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మొరిగాడి రమేష్, వడ్డేమాన్ బాలరాజు, చింతల నాగరాజు ,చెక్క పరశురాములు, వడ్డిమాను విప్లవ్ ,మైలారం రమేష్ ,ఎండి ఖలీల్ ,ఎర్ర రాజు, దండు నాగరాజు, ఎండి అఖిల్, ఎండి మతిన్ తదితరులు పాల్గొన్నారు.

రాములు స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు జల్లెల పెంటయ్య

నవతెలంగాణ-రామన్నపేట



తెలంగాణ సాయుధ పోరాట యోధులు పాల్వంచ రాములు స్ఫూర్తితో ప్రజాపోరాటాలు చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటి సభ్యులు జల్లెల పెంటయ్య అన్నారు. రాములు 18వ వర్ధంతిని బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎం) పట్టణ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బీసీ కాలనీలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాట నాయకులు పాల్వంచ రాములు స్ఫూర్తితో ప్రజా పోరాటాలు నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. పాల్వంచ రాములు వెట్టి చాకిరికి వ్యతిరేకంగా, భూస్వామ్య దోపిడికి వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి పోరాడిన యోదుడన్నారు. నిజాం సైన్యం గ్రామాల మీద పడి దోపిడీ చేస్తూ అరాచకం సృష్టిస్తున్న సమయంలో ఎదురు నిలిచి ఉద్యమించారాన్నారు. స్వతహాగా కళాకారుడిగా ఆటా పాటలతో ప్రజలను చైతన్యం చేశారన్నారు. రావి నారాయణరెడ్డి, ఆరుట్ల కమలాదేవి దళాల్లో చురుకుగా పని చేశారన్నారు. కనిపిస్తే కాల్చివేయాలనే నిర్బంధాలను ఎదుర్కొన్నాడన్నారు. ఆజాంగా పేరు మార్చుకుని, అజ్ఞాత జీవితం గడిపిన మహా నాయకుడు పాల్వంచ రాములు కడదాక ఎర్ర జండా వదలని విక్రమార్కుడన్నారు. పాల్వంచ రాములు జీవితాన్ని చరిత్ర పుస్తకాల్లో లిఖించాలని కోరారు. వారి స్ఫూర్తితో మరిన్ని పోరాటాలు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా అధ్యక్షులు మామిడి వెంకట్‌రెడ్డి, టౌన్ కార్యదర్శి గాదె నరేందర్, మండల కార్యదర్శివర్గ సభ్యులు బోయిని ఆనంద్, నాయకులు కందుల హనుమంతు, గొరిగె సోములు, మునికుంట్ల లెనిన్, పాల్వంచ శంకర్, లక్ష్మి, వెంకటేశం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ ఎంపీటీసీ

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని మనీ పంపుల గ్రామంలో మండల ప్రజాపరిషత్ నిధుతో కట్ట యాదయ్య ఇంటి నుండి పోగుల వెంకటమ్మ ఇంటి వరకు నిర్మిస్తున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను గ్రామ మాజీ ఎంపీటీసీ గాదే పారిజాత ముకుందం బుధవారం పరిశీలించారు. నాణ్యతతో నిర్మించాలని ఆమె సూచించారు.

గ్రామ రహదారుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు బల్గూరి అంజయ్య

నవతెలంగాణ-రామన్నపేట



మండల కేంద్రం నుండి గ్రామాలను కలిపే ప్రధాన రహదారుల నిర్మాణం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని సీపీఐ(ఎం) మండల కార్యదర్శివర్గ సభ్యులు బల్గూరి అంజయ్య అన్నారు. సీపీఐ(ఎం) పార్టీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని సిరిపురం గ్రామంలో ఆ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా నేను మాట్లాడుతూ సిరిపురం-వెలిమినేడు మెటల్ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చి ప్రజల సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామంలో శిథిలావస్థకు చేరిన రోడ్లను బాగుపరచాలన్నారు. నిత్యం వందలాది ప్రయాణికులు, రైతులు, గ్రామాల ప్రజలు ప్రయాణించే ప్రధాన రహదారి కంకర తేలి గుంతలమయంగా మారి ఏండ్ల తరబడి బిటి రోడ్డుకు నోచుకోకుండా పోతుందన్నారు. తుమ్మలగూడం నుండి వయా సిరిపురం మీదగా పెద్దకాపర్తి, వెలిమినేడు గ్రామాలకు ఇదే ప్రదాన రహదారి అనేక మార్లు ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. నూతనంగా ఎర్పడిన రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని బిటి రోడ్డు నిర్మించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రామ శాఖ కార్యదర్శి అంబటి మల్లారెడ్డి, మాజీ ఎంపీటీసీ బడుగు రమేష్, మాజీ సర్పంచ్ మిర్యాల భాస్కర్, నాయకులు భారత మృత్యుంజయ, దాడి మల్లారెడ్డి, సుభాష్‌రెడ్డి, గుంజె సైదులు, మోటె స్వామి, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాతం ప్రదర్శన

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి షియా ముస్లిం సంఘం ఆధ్వర్యంలో బుధవారం మొహర్రం 10వ రోజు అశూరా పురస్కరించుకుని మాతం ప్రదర్శన నిర్వహించారు. ముహమ్మద్ ప్రవక్త మనువడు ఇమాం హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ మాతం ప్రదర్శన పట్టణంలో భక్తి శ్రద్ధలతో మధ్యాహ్న జంప్ ఖానా గూడెం లోని హజ్రత్ అబ్బాస్ పీర్ల చావడి నుంచి ఖాజీ మోహిల్లా బీబీ కా ఆలం ఆషూర్ ఖానా వరకు, రాత్రి 8 గంటలకు హైదరాబాద్ చౌరస్తాలోని కార్బలా మైదానం (సోయే పీర్ దర్గా) నుంచి దర్గా కమాన్ వద్ద ఉన్న షహజాదే ఖాసిం పీర్ల చావడి వరకు మాతం ప్రదర్శన చేశారు. ఈ మాతం ప్రదర్శనలో షియా ముస్లిం యువత కత్తులతో ఎదను బాదుకుంటూ ఇమామ్ హుస్సేన్ బలిదానాన్ని స్మరిస్తూ రక్తం చిందిస్తారు. షియా ముస్లిం మత పెద్ద హాశిమ్ ఆరిఫ్ ధార్మిక సందేశం అందజేశారు. నోహ్, పఠిస్తూ ఈ ప్రదర్శన కొనసాగనుంది. ఆయా కార్యక్రమాల్లో ముఖ్య అతిగా మున్సిపల్ చైర్మన్ పోతాంశెట్టి వెంకటేశ్వర్లు, ముస్లిం సంఘం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రజా హుస్సేన్, కార్యదర్శి కల్బే హుస్సేన్, ప్రతినిధులు లాయక్ అలి, తఖీ హుస్సేన్, హైదర్ అలి, అస్గర్ అహ్మద్, సజ్జాద్ హుస్సేన్, అఘా మహేది, అద్నాన్ పాల్గొన్నారు.

అలాగే.. భువనగిరి పట్టణంలోని భారఇమామ్ ఆశీర్ఖానాలో భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్, హిరకర్ శ్రీను ఆధ్వర్యంలో మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొహర్రం పండుగ కుల మతాలుకు అతీతంగా చేసుకువడం చాలా సంతోషంకరం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు. బోయిని బాలయ్య. రవి వర్ధన్. అఖిల్ పుట్ట గిరీష్ పాల్గొన్నారు.

భువనగిరి కలెక్టరేట్ : భువనగిరి మండలంలోని మన్నెవారిపంపు గ్రామంలో మొహరం పండుగలో భాగంగా పీర్ల పండుగను కులమతాలకతీతంగా ఘనంగా జరుపుకున్నారు. బుధవారం గ్రామంలో ఇంటింటికి రాగా ప్రజలు, భక్తులు ఊదు బెల్లంతో కుడుకలు దట్టీలు సమర్పించుకొని మొక్కులను చెల్లించుకున్నారు. సాయంత్రం పీర్లను ఊరేగింపు నిర్వహించిన అనంతరం మక్కకు (బావిలో వేశారు) సాగనంపారు. ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామ ప్రజలు బోయిని గండయ్య, పెంటయ్య, హరినాథ్, మాజీ సర్పంచ్ బోయినీ పాండు, మెడబోయిన రాజయ్య, జహంగీర్, మెరుగు నరసింహ, హరినాథ్, గణేష్, బోయిని మల్లేశం, జంగయ్య, శ్రీనివాస్, అంకర్ల కిషన్, బోయిని మదన్, మధు, సాయి కిరణ్, ఉపేందర్, మధు, మణికంఠ, గోరేమియా, సలీం సాజిత్‌లు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం మొహరం పండుగ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.తెల్లవారుజామున మొహర్రం వేడుకల్లో భాగంగా పీర్ల సవారీతో గ్రామ వీధుల్లోకి రాగా భక్తులు దారిపోడవునా నీరుపోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ మొహారం వేడుకల్లో ఆయా పార్టీల నాయకులు ప్రజలుపలువురు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ, సూర్యాపేట
యాదాద్రిభువనగిరి
గురువారం | జులై 18, 2024 | www.navatelangana.com

ప్రముఖులకు మున్సిపల్ చైర్మెన్ సన్మానం



నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము తిరుపతిలో భారతదేశ కురుమ కులస్తుల అభినందన సభలో పార్లమెంటు సభ్యుడిగా, ఎమ్మెల్యేగా గెలుపొందిన,కేంద్ర మంత్రి ఎస్ పి సింగ్ బగేళ్లను, కర్ణాటక మాజీ మంత్రి రేవన్న ను,ఆల్ ఇండియా బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్యలని, ఆలేరు మున్సిపల్ చైర్మెన్ వస్పరి శంకరయ్య బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.

రైతులను మోసం చేసేందుకే కమిటీలు

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద భిక్షమయ్యగౌడ్

నవతెలంగాణ-ఆలేరుటౌను

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో పంట రుణమాఫీ చేయాలని, రైతులను మోసం చేసేందుకే కమిటీ వేస్తామని కాంగ్రెస్ చెబుతుందని, ఆలేరు మాజీ శాసనసభ్యులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బూడిద భిక్షమయ్యగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికలలో ఓటు వేయించుకునేటప్పుడు, రుణమాఫీ అందరికి చేస్తామని చెప్పారని, రుణాలు తెచ్చుకోమని రైతులకు ఆశ చూపారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చి ఇప్పుడు రేషన్ కార్డు ఉన్నవారికి రుణమాఫీ అంటున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు రైతులకు రెండు లక్షల పంట రుణమాఫీ చేస్తానని ,ఇప్పుడు రేషన్ కార్డు ఉండాలని రైతులను ఇబ్బంది చేస్తున్నారన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారిని చైతన్యపరిచి ప్రభుత్వంపై ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

ఆట..పాట.. అంగన్‌వాడీ బాట...!



- అనుముల ప్రాజెక్టు లో ఆకట్టుకునే అంశాలతో విద్యాబోధన
- కేంద్రాలకు పెరుగుతున్న ఆదరణ
- ఏటా పెరుగుతున్న చిన్నారులు

నవతెలంగాణ-పెద్దవూర

బుడిబుడి అడుగులు వేసే చిన్నారులు ఆటలు ఆడుతూ.. పాటలు పాడుతూ.. అక్షరాలు నేర్చుకునేందుకు అంగన్‌వాడీ బాట పడుతున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు రోజురోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా బోధిస్తూ అంగన్‌వాడీ టీచర్లు వారెవ్వా.. అనిపించుకుంటున్నారు. వివిధ ఆట వస్తువులు, చార్టులను తయారు చేసి చిన్నారులకు శ్రద్ధతో విద్యనందిస్తున్నారు. మూడేళ్ల వయస్సు నుంచే చిన్నారులను మురిపిస్తూ.. నూతన విద్యకు శ్రీకారం చుడుతూ గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అనుముల ప్రాజెక్టు పరిధిలో నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పెద్దవూర, తిరుమలగిరి సాగర్, అనుముల, నిడమనూరు మండలాలలో మొత్తం 255 అంగన్వాడీ కేంద్రాలలో 510 మంది అంగన్వాడీ టీచర్లు, ఆయాలు ఉన్నారు.13,279 మంది లబ్ధిదారులకు అంగన్వాడీ టీచర్ల పౌష్టికారం అందిస్తున్నారు.అలాగే పెద్దవూర మండల వ్యాప్తంగా మొత్తం 72 అంగన్వాడీ పాఠశాలలు వున్నాయి.ఈ కేంద్రాలలో 2022లో 630 మంది పిల్లలు, 2023లో మంది ప్లిలలు 660 ఉండగా.. ప్రస్తుతం 780 పిల్లలతో అంగన్‌వాడీ సెంటర్లకు పిల్లల సంఖ్య పెరిగింది. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అంగన్‌వాడీ టీచర్లు అవగాహన కల్పించడం, తల్లిదండ్రులు సహకరించడంతోనే విజయవంత మవుతున్నామని అనుముల ఇన్‌చార్జి సీడీ పీఓ సువర్ణ చెపుతున్నారు.

-గర్భిణులు, బాలింతలకు అవగాహన

గ్రామాల్లో గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం ఎలా తీసుకోవాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి చెబుతున్నారు. పోషక విలువలున్న పౌష్టికాహారాన్ని అందిస్తూ తగు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. కాగా చిన్నారులకు ఎంత చెప్పినా వారు చెప్పిందే వేదం అన్న మాదిరిగా వ్యవహరిస్తుంటారు. కానీ వారికి అర్థమయ్యే రీతిలో ఆటలు, పాటలు, కథలు చెబుతూ కంటికి రెప్పలా కాపాడుకుంటూ విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు.

-విద్యాబుద్ధులు నేర్పిస్తూ..

చెన్న శ్రీదేవి అంగన్‌వాడీ టీచర్, బట్టుగూడెం

ఆట, పాటలు, కథలతో పాటు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం. ఇటు పిల్లలను కంటికి రెప్పలా చూసుకుంటూ.. అటు అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించేలా అవగాహన కల్పిస్తున్నాం. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు ప్రతిరోజూ పౌష్టికాహారాన్ని అందిస్తున్నాం.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

అంబటి మణెమ్మ అంగన్‌వాడీ టీచర్ నిడమనూరు

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలి. వాటిలో చిరుధాన్యాలతో పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. రోజువారీగా పోషకాలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం పదిలంగా ఉంటుంది.



ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- వివేకానంద వృద్ధాశ్రమ నిర్వాహకులు సవరాల సత్యనారాయణ

నవతెలంగాణ-సూర్యాపేట

స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ప్రముఖ నగరాలకు చెందిన దవాకానాల ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగ చేసుకోవాలని వివేకానంద వృద్ధాశ్రమ నిర్వాహకులు సవరాల సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక వివేకానంద వృద్ధాశ్రమంలో హైదరాబాద్కు చెందిన కంచి కామకోటి వారి శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి సంబంధిత వ్యాధులకు ఉచిత పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆపరేషన్లు మందులు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసుపత్రి ఆర్గనైజర్ బాలరాజు మాట్లాడుతూ ఆసుపత్రి ఆధ్వర్యంలో 30 లక్షలు కంటి ఆపరేషన్లు ఐదు కోట్ల మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆపరేషన్ అవసరం ఉన్న వారిని హైదరాబాద్కు తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్ నిర్వహించే నెల తరువాత మళ్లీ వచ్చి వారిని పరీక్షించడం జరుగుతుందన్నారు. దూరప్రాంతాలకు వెళ్లి ఖరీదైన వైద్యం చేయించుకోలేని పేదలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో డాక్టర్లు రిషాయ్, వేదిక, పార్వతి, గోల్డెన్, సందీప్, వృద్ధాశ్రమ ట్రస్ట్ సభ్యులు తల్లాడ కృష్ణమూర్తి, బండి శ్రీనివాస్, కొత్త మల్లికార్జున్, కోటగిరి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుటుంబానికి ఆర్థికసాయం

నవతెలంగాణ-రాజపేట

మండలంలోని దూది వెంకటాపురం గ్రామానికి చెందిన చామకూర వెంకన్న ఇటీవల మృతి చెందగా బుధవారం తోటి 1995-96 ఎస్ఎస్సీ బ్యాచ్ స్నేహితులు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. తోటి స్నేహితులు పోగుచేసిన రూ.50వేలలను చామకూర వెంకన్న పిల్లల పేరున ఫిక్స్ డిపాజిట్ చేసి అట్టి ధ్రువీకరణ పత్రాన్ని పిల్లలకు అందజేశారు. చామకూర వెంకన్న కుటుంబానికి మనోధైర్యాన్ని అందిస్తూ అవసరమైన సమయంలో సహాయ సహకారాలు అందించినట్లు చెప్పారు. 1995-96 విద్యా సంవత్సరంలో నమిల ఉన్నత పాఠశాలలో చదివిన



చామకూర వెంకన్న కుటుంబానికి తోటి స్నేహితులు అందిస్తున్న ధైర్యం ఆర్థిక సాయం పట్ల అన్ని పార్టీల వారు గ్రామ పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. చామకూర వెంకన్న స్నేహితులు ఆదర్శంగా నిలుస్తారని కితాబిచ్చారు.

అర్ధరాత్రి అయితే కాపలా కాయాల్సిందే

నవతెలంగాణ-కోదాదరూరల్

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొమరబండ గ్రామంలోని కేఎల్ఆర్ ఏవెన్యూలో రాత్రి అయితే ఏ మూలన దొంగతనం జరుగుతుందో అని భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటివరకు కాలనీలో చాలా దొంగతనాలు జరిగాయి. గడిచిన రెండు నెలలలో 14 తులాల బంగారం, మూడు కేజీల వెండి సుమారు రెండు లక్షల వరకు నగదు దొంగలు ఎత్తుకొని వెళ్లారు. దీంతో కాలనీలో రోజురోజుకు దొంగతనాలు పెరగడంతో ఆ కాలనీవాసులు గస్తీ కాస్తున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక కానిస్టేబుల్‌ని కూడా ఏర్పాటు చేశారంటే పరిస్థితి ఏ విధంగా



ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. తలుపు చప్పిడైనది అంటే ఆ కాలనీలో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారు. కాలనీకి సెక్యూరిటీ ఏర్పాటు ఉన్న వెనుక వపు నుండి గోడలు దూకి మరి వస్తున్నారు అని కాలనీ వాసులు తెలుపుతున్నారు. అంతేకాకుండా ద్విచక్ర వాహనాలకు సపరేట్గా స్టిక్కర్లు కూడా వేయించారు. ఏ విధమైన అనుమతులు లేనిదే ఎవరిని కూడా లోపలికి ఎలా చేయడం లేదు దీంతో కేఎల్ఆర్ రెవెన్యూలో పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి పెట్రోలింగ్ వాహనాన్ని రాత్రిపూట ప్రతి గల్లీలో తిప్పాలి అని పోలీస్ సిబ్బంది కూడా ఎక్కువగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

నేడు సీఎం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-చౌటుప్పల్‌రూరల్

చౌటుప్పల్ మండలం జై కేసారం క్లస్టర్ పరిధిలో కుంట్లగూడెం రైతు వేదికలో నేడు మధ్యాహ్నం 3:30 గంటలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ లబ్దిదారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడతారని చౌటుప్పల్ మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రైతులు ప్రజాప్రతినిధులు అధికారులు లబ్ధిదారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏవో నాగరాజు కోరారు.

శ్రీ సాయి దత్త ఆశ్రమంలో సామూహిక వ్రతాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మిర్యాలగూడ రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో బుధవారం సామూహిక సాయి సత్య వ్రతాలు నిర్వహించారు. తెల్లవారుజామున 5 గంటలకు హారతితో ప్రారంభించి శ్రీ నాగ సాయి విగ్రహానికి పంచామృత అభిషేకములు జరిపారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని సామూహికంగా వ్రతములు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గుండా శ్రీనివాస్ఆలయ కార్యదర్శులు నరేందర్, ఉపాధ్యక్షులు ప్రతాప్ మట్టయ్య సోమన్న జగన్నాథ రావు జానకి రాముడు, రవి నాగన్న, విక్రం, వెంకన్న, విజయ్ అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

జిల్లా ప్రజలు తొలి ఏకాదశి పర్వదినాన్ని వైభవంగా భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా నల్లగొండ పట్టణంలోని పచ్చల సోమేశ్వరాలయం, ఛాయా సోమేశ్వరాలయం, రామాలయం, తదితర దేవాలయాలు కిటికీటలడాయి. ఆలయాలలో అర్చకులు స్వామివారికి ప్రత్యేకంగా అభిషే కాలు, విశేషపూజలు నిర్వహించారు. ఉపవాసం ఉండి అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆదర్శ వృద్ధాశ్రమంలో ఘనంగా జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-చింతపల్లి

చింతపల్లి మండల కేంద్రంలో గల ఆదర్శ వృద్ధాశ్రమంలో నసర్లపల్లి గ్రామానికి చెందిన కొడిదాల నాగార్జున జన్మదినం సందర్భంగా బుధవారంపండ్లు, భోజనవసతిని కల్పించారు. కేక్‌కట్ చేసినా అనంతరం ఆయన మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అంటూ వృద్ధాశ్రమంలో నాజన్మదిన వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషక రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొడిదాల గణేష్, రాసిక శివ,పి. వెంకటేష్,పసుపుల జగన్, కన్నయ్య, పి. భరత్,పి. భాగ్యలక్ష్మి, శ్యామల, తేజశ్రీ, పూజశ్రీ తదితర మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కొలనుపాకలో సీఎం వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ-ఆలేరు టౌన్

ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో గురువారం రైతువేదికలో వీసీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 3:30 గంటలకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య హాజరుకానున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కే వెంకటేశ్వరరాజు బుధవారం విలేకరులకు ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ఉప సర్పంచులు, కౌన్సిలర్లు మండలం గ్రామ శాఖ అధ్యక్షులు రైతు సంఘం నాయకులు మహిళా శాఖ అధ్యక్షులు వంద సంఘాలు హాజరుకానున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యార్థులపై వీధి కుక్కలు దాడి

నవతెలంగాణ-కోదాడ రూరల్

మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో విద్యార్థులు ట్యూషన్‌కి వెళ్లి వస్తున్న క్రమంలో వీధి కుక్కలు దాడి చేసిన ఘటన మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం షేక్ యాకుబ్ పాషా రిజ్వానా కుమారుడు షేక్ అశ్రఫ్ ట్యూషన్‌కి వెళ్లి వస్తున్న క్రమంలో వీధి కుక్కలు క్రింద పడేసి దాడి చేశాయి.



సమీపంలోని కాలనీవాసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని బాలుడిని కాపాడి ద్విచక్ర వాహనంపై వారి ఇంటి వద్దకు చేర్చడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మున్సిపల్ అధికారులు స్పందించి వేదికుక్కల వారి నుండి విద్యార్థులను చిన్నపిల్లలను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజల కోరుతున్నారు.

విద్యుద్ఘాతంతో ఆవు మృతి


నవతెలంగాణ-రాజపేట

మండలంలోని రఘునాథపురం గ్రామానికి చెందిన బందెల బాల్‌రాజ్ అనే రైతు ఆవు బుధవారం వ్యవసాయ బావి వద్ద మేత మేస్తుండగా ఆకస్మాత్తుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మరణించడం జరిగింది. ప్రమాదవశాత్తు అకస్మాత్తుగా మరణించిన ఆవును చూసిన రైతు బాలరాజు కంటతడి పెట్టుకున్నాడు. బాలరాజు ఇటీవల అవును 90 వేల రూపాయలకు కొనుగోలు చేశాడు. సుమారుగా లక్ష రూపాయల నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని కోరారు.

విద్యుద్ఘాతంతో మూడు గేదెలు మృతి

నవతెలంగాణ-కోదాదరూరల్

విద్యుద్ఘాతంతో మూడు గేదులు మృతి చెందిన ఘటన పట్టణంలోని గుడిబండ వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో పొలాల్లో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని గుడిబండ రోడ్‌లో గల వైష్ణవి స్కూల్ నందు వ్యవసాయ క్షేత్రం నందు కరెంటు తీగ కిందపడి ఉండటంతో రైతులు గేదేలు మేపుతుండగా అటువైపు వెళ్ళిన గేదెలు ప్రమాదవశాత్తు కరెంటు తీగ తగిలి మూడు గేదలు మృతి చెందాయి. గేదెల యజమానులు దండల వీరారెడ్డి, మారెడ్డి లింగారెడ్డి, షేక్ యాసుబ్



ముగ్గురి వ్యక్తులకు చెందిన గేదెలు విలువ సుమారు 2.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలుపుతూ ఆవేదన వ్యక్తం చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

- 120 బస్తాలను లోడు చేస్తుండగా పట్టుకున్న పోలీసులు

నవతెలంగాణ-చివ్వెంల

అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని డీసీఎంలో హైదరాబాద్‌కు తరలించేందుకు లోడు చేస్తున్న సమయంలో పోలీసులు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. చివ్వేంల ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...ఇదే మండలంలోని వాల్యా తండాకు చెందిన బాణోతు హరిప్రసాద్ తండ్రి బాల్యా, చందు నాయక్ తండాకు చెందిన అతని బంధువు దేవసోతు లింగ తండ్రి చందా ఇద్దరు కలిసి బీబీగూడెం, పలు తండాల్లో మండలంలోని చుట్టూ ప్రక్కల గ్రామాల్లో బియ్యం లబ్దిదారుల నుండి కొనుగోలు చేసి ఒక చోట నిల్వ చేసుకుంటున్నారు. మంగళవారం రోజున వాల్యా తండాకు చెందిన ధరావత్ కృష్ణ తండ్రి టాక్రియ, డీసీఎం డ్రైవర్ టీఎస్ -29TA-1163 నెంబర్ గల బండిలో 120 బస్తాల బియ్యం హైదరాబాద్ తీసుకువెళ్లి అక్కడ అమ్మేందుకు సిద్ధమై లోడు చేస్తుండగా ముగ్గురిని పట్టుకున్నామని వెల్లడించారు. డీసీఎం వాహనం సీజ్ చేసి కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోని కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుని ఎన్నిక

నవతెలంగాణ-ఆలేరుటౌను

ఆలేరు మండల కేంద్రంలో బుధవారం పద్మశాలి సంఘం నూతన అధ్యక్ష ఎన్నిక సభ్యుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలైన ఓట్లు మొత్తం177 కాగా, 116 పాశికంటి శ్రీనివాస్,39 చింతకింది రామానుజం,19 రాపోలు ప్రకాష్, 3.చిత్తు ఓట్లు పోలయ్యాయి. 116 ఓట్లు చిన్న పాషికంటి శ్రీనివాసులు ఏకగ్రీవంగా అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం

- పోనుగోటి హనుమంతరావు

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

పీఎంపీ (ప్రైవేట్ మెడికల్ ప్రాక్టీషనర్), ఆర్ఎంపి(రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్)ల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రుణపడి ఉంటామని సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు పొనుగోటి హనుమంతరావు అన్నారు. పిఎంపి, ఆర్ఎంపి ల సమస్యలను పరిష్కరించాలని, శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లను అందజేయాలని ఆదేశించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఫ్లెక్సీలకు బుధవారం జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్లో సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎంపి, ఆర్ఎంపీల సమస్యలు పరిష్కరించాలని ఇటీవలే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశామని తెలిపారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సూచించడం హర్షనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరాజు, కార్యదర్శి నరసింహా రెడ్డి, బ్రహ్మచారి, డిఎస్ఎన్.చారి, ఎండి. నసిరుద్దీన్, వెంకటేశ్వర్లు గౌడ్, మదన చారి, యాదగిరి, అంజయ్య, లలిత, మణి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన ప్రక్రియలో జాప్యం

- బంటు వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-మిర్యాలగూడరూరల్

రాష్ట్ర ప్రభుత్వం బీసీ గణ న చేయడంలో జాప్యం చేస్తుందని బీసీ సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షుడు బంటు వెంకటేశ్వర్లు బుధవారం అన్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పి మోసం చేస్తుందన్నారు. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోని బీసీల కులగణన ప్రారంభిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అవుతున్న దానికి సంబంధించినటువంటి విధివిధానాల అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు.

సాయిబాబా ఆలయంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు

నవతెలంగాణ-మిర్యాలగూడ

తొలి ఏకాదశి ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలోని హనుమాన్ పేట సాయిబాబా ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు అత్యంత భక్తి శ్రద్ధలతో బుధవారం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నీలా పాపారావు, పెండ్యాల పద్మ, గంధం సైదులు, ఆలయ పూజారి గోవింద్ పాండే, సీతమ్మ గిరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నవగ్రహ హోమం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని గోపలాయపల్లి గ్రామంలో ఉన్న శ్రీ వారిజల వేణుగోపాల స్వామి దేవస్థానములో బుధవారం నవగ్రహ హెూమం (నవగ్రహ దోషములకు) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్ ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, కోమటిరెడ్డి మోహన్ రెడ్డి, , దంపతులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశి మొహర్రం పండగ వేడుకలు

నవతెలంగాణ-ఆలేరుటౌను

ఆలేరు పట్టణం మరియు మండలంలోని పలు గ్రామాలలో బుధవారం ముక్కోటి ఏకాదశి మొహరం పాండా వేడుకలు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఓకే రోజు బుధవారం రెండు పండగలు రావడంతో విష్ణు ఆలయం, పీరీలతో వీధులలో పండగ వాతావరణం నెలకొంది. గ్రామలలో,గత మూడు రోజుల నుండి డప్పు చప్పుల మధ్య భక్తి శ్రద్ధలతో పీర్లను ఎత్తుకొని వీధివీధిన గుగ్గిలం సాంబ్రాణి వేస్తూ సవార్లను ఎత్తుకొని పీర్ల పండుగ నిర్వహిస్తున్నారు. గ్రామల ప్రజలు భారీ ఎత్తున సవర్దారులకు కాళ్లకు నీళ్ల పోస్తూ స్వాగతం చెబుతున్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని కొలనుపాక, శర్బానాపురం, తూర్పు గూడెం, శారాజుపేట, టంగుటూరు, రాఘవపురం, గుండ్లగూడెం, పటేల్‌గూడెం, శ్రీనివాసపురం, మంతాపురి, కొల్లూరు, గోలనకొండ, పట్టణంలో, బదురుపేట, సాయిగూడెంతో పాటు పలు కాలనీలలో మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాస్టర్స్ నియోజకవర్గ నూతన కోర్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణంలోని నాయనగ చర్చి ఆవరణలో జరిగిన యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన కోర్‌కమిటీ నియోజకవర్గ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మున్సిపల్ క్రిస్టియన్ మైనార్టీ కో ఆప్షన్ మెంబర్ ఒంటెపాక జానకి ఏసయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు.కోర్ కమిటీ చైర్మన్ గా రెవరెండ్ డాక్టర్ సిహెచ్ లూకా కుమార్,కో- చైర్మన్ గా రెవరెండ్ డాక్టర్ జి ఆర్ అబ్రహం, చీప్ కో- ఆర్డినేటర్‌గా రెవరెండ్ ఎం సుందర రావు, మెంబర్స్ గా వాకా శ్రీనివాసగౌడ్, కె శాంత వర్ధన్, వి రూబెన్, నియోజకవర్గ కమిటీ అధ్యక్షులుగా రెవరెండ్ డాక్టర్ వి యేసయ్య, ఉపాధ్యక్షుడిగా, డేవిడ్ రాజారావు, జనరల్ సెక్రటరీగా రాజేష్, జాయింట్ సెక్రెటరీ ఎం శ్రీహరి, హారిగోమ్స్,ట్రెజరర్ గుడిబండ బజయ్య, ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నేడు రైతువేదికలలో రుణమాఫీ సంబరాలు

నవతెలంగాణ-చింతలపాలెం

నేడు దొండపాడు రైతు వేదికలో రుణమాఫీ సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఏఓ శ్రీనివాస్ గౌడ్ విలేకరులతో ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని దొండపాడు రైతు వేదికలో మధ్యాహ్నం 3 గంటలకు చింతలపాలెం మండల రైతులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గౌరవ ముఖ్య మంత్రి వర్యులు గారిచే నేటి నుండి లక్షలోపు నేరుగా రుణమాఫీ లాంచనంగా ప్రారంభము, లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడుతారని అన్నారు. రైతు వేదిక ద్వారా రైతులు ఈ కార్యక్రమాన్ని వీక్షించొచ్చని, వీడియో కాన్ఫరెన్స్ (దృశ్య శ్రవణ మాధ్యమం) ద్వారా రుణమాఫీ రైతుల ఖాతాలకు నేరుగా డబ్బులు జమ చేయడం జరుగుతుంది. రుణమాఫీ డబ్బులు విడుదలైన రోజునే రైతు వేదికల్లో రుణమాఫీ లబ్ధిదారులతో సంబరాలు జరుపుకోనున్నారని అన్నారు. కాబట్టి ఈ కార్యక్రమంను విజయవంతము చేయాలని కోరారు. కార్యక్రమాలలో అభ్యుదయ రైతులు, బ్యాంకు ప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, ప్రజాప్రతినిధులు ఈ సంబరాల్లో పాల్గొంటారన్నారు.

రైతు సంబరాలకు ఏర్పాట్లు చేయాలి

- నేడు లక్ష రుణమాఫీ
- సాయంత్రం 4 గంటలకు సీఎం వీసీ ద్వారా రైతులతో మాట్లాడతారు
- కలెక్టర్ నారాయణరెడ్డి

నవతెలంగాణ -నల్గొండ కలెక్టరేట్

రైతు రుణమాఫీలో భాగంగా నేడు రాష్ట్ర వ్యాప్తంగా రైతు రుణమాఫీ పొందిన రైతులతో రైతు వేదికలలో సంబరాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై బుధవారం అయిన జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్, మండల వ్యవసాయ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయల లోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ ప్రకటించిందని, ఇందులో భాగంగా గురువారం లక్ష రూపాయల లోపు రుణాలున్న రైతుల రుణమాఫీ చేయడం జరుగుతున్నదని, ఇందుకు సంబంధించి రైతుల వివరాలన్నీ వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్లకు పంపించడం జరిగిందని తెలిపారు.ఈ మేరకు రుణమాఫీ పొందిన రైతులు గురువారం మధ్యాహ్నం 2 గంటల నుండి



సాయంత్రం 4 గంటల వరకు సంబంధిత రైతు వేదికల వద్దకు ర్యాలీలు, డప్పులతో చేరుకుంటారని, అనంతరం సాయంత్రం 4 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రుణమాఫీ పొందిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మాట్లాడనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకుగాను జిల్లాలోని అన్ని రైతు వేదికల వద్ద అవసరమైన ఎల్ఈడి స్క్రీన్లు, ఇతర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలలో సంబంధిత ఎమ్మెల్యేలు పాల్గొంటారని, నల్గొండ అసెంబ్లీకి సంబంధించి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీలు,ఇతర ప్రజాప్రతినిధులు నల్గొండ జిల్లా కేంద్రంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించే సంబరాలకు హాజరుకానున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు రైతులు ర్యాలీగా ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్ కి చేరుకుంటారని, అనంతరం సాయంత్రము 4 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి కొద్దిమంది రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడానున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా లోని అన్ని రైతు వేదికల తో పాటు, ఎం ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్లో సైతం తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆయన వ్యవసాయ శాఖ జిల్లా అధికారిని ఆదేశించారు. ప్రతి మండలం నుండి సుమారు 200 మంది రైతులు రైతు వేదికల వద్ద సంబరాలలో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, మండలాల వ్యవసాయ అధికారులు ఈ టెలి కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

కోట్లు ఇచ్చి ఎమ్మెల్యేలను కొంటున్నారు

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు ఇచ్చి, బతిమిలాడి కొనుగోలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైల శేఖర్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రేవంత్‌రెడ్డి సర్కార్ రైతు రుణమాఫీ, రైతుబంధు విషయంలో అభిప్రాయ సేకరణ పేరుతో నాటకాలు ఆడుతోందని, సాగుచేసిన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు, తెలంగాణ అభివృద్ధిని చేస్తూ , పార్టీని పట్టించుకోకపోవడం, చిన్నచిన్న పొరపాట్ల వల్ల ఎన్నికలలో ఓడిపోవడం జరిగిందని, ఎన్నికలలో గెలుపోవటములు సహజమని అన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని పొరపాటు చేశామని, అందుకే ప్రజలు జీర్ణించుకోలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ కూడా మేము చేసిన పొరపాటును పునరావృతం చేస్తుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. మూసి ప్రక్షాళన కోసం 70,000 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి, రైతులకు రైతుబంధుపై ప్రజాప్రతి సేకరణ ఎందుకని, రైతులపై సీఎంకు చిత్తశుద్ధి లేదని నిలదీశారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలో యాదాద్రి ఫ్లవర్ ప్లాంట్ కు ఒక రోజుకు 50 లారీల చొప్పునని పర్మిషన్ తీసుకొని, మిగతా 300 లారీలను హైదరాబాద్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేనియెడల ప్రజాక్షేత్రంలో ప్రత్యక్ష కార్యాచరణ ప్రకటించి, ప్రజలతో కలిసి ప్రజా పోరాటాలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జడల అమరేందర్ గౌడ్, కొలుపుల అమరేందర్, సుదగాని హరి శంకర్, కల్లూరి రామచంద్ర రెడ్డి, కంచి మల్లయ్య, ఎనబోయిన ఆంజనేయులు, ఏవి కిరణ్ కుమార్, జనగాం పాండు, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, అతికం లక్ష్మీనారాయణ, కేశవపట్నం రమేష్, ఇట్టబోయిన గోపాల్, తాడెం రాజశేఖర్ తాడూరి బిక్షపతిలు పాల్గొన్నారు.



ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-పెద్దవూర

పెద్దవూర మండలంలో ఏడు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టు బడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ వీరబాబు తెలిపిన సమాచారం ప్రకారం తుంగతుర్తి గ్రామానికి చెందిన తెలకపల్లి సాంబశివ అను అతని ఇంటి యందు రేషన్ బియ్యం వున్నాయని తెలిసిన సమాచారం ప్రకారంఅతని ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా సుమారు 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టు బడింది.ఇట్టి బియ్యంను అదే గ్రామానికి చెందిన ఈసరం ఏడుకొండలు, వంగూరి నరేందర్, ఈసరం ఈదయ్య ,దుగ్యాల సైదులు, వెంకటకృష్ణ ఇంకొంతమంది కలిసి అట్టి బియ్యంనుఅధిక ధరలకు అమ్ముటకు కాను సాంబశివ ఇంటిలో జమ చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం ద్వారా సరఫరా చేయబడుతున్న పిడిఎస్ బియ్యంను అమ్మటం కానీ కొనటం గాని చట్ట ప్రకారం నేరం. ఇట్టి వ్యక్తులు చట్టవిరుద్ధంగా పిడిఎస్ బియ్యంని అధిక ధరలకు అమ్ముతున్నారు, కావున వారిపై కేసు నమోదు చేసుకుని బియ్యం ను స్వాధీనం చేసుకొని గోదాంకు తరలించనైనదనీ ఎస్ వీరబాబు తెలిపారు.ఎవరైనా వ్యక్తులు రేషన్ బియ్యంని అమ్మడం గాని కొనడం గాని చేస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలి: డీఎస్పీ

నవతెలంగాణ-మునగాల

విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, క్రమశిక్షణ, మంచి ప్రవర్తనలు కలిగిన విద్యార్థులు విజేతలుగా నిల పెడతారని కోదాడ డీఎస్పీ మామిళ్ళ శ్రీధర్ రెడ్డి అన్నారు. బుధవారం ఆకుపాముల సమీపంలో గల ఎస్ఆర్ఎస్ కాలేజ్ పేరెంట్స్ మీట్‌లో ఆయన మాట్లాడారు. ఇంట ర్మీడియట్ దశలో విద్యార్థులు క్రమశిక్షణతో వుండాలన్నారు. మంచి ప్రవర్తనను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సరదా కోసమో,ఉత్సాహం కోసం దురల వాట్ల బారిన పడే అవకాశం వుం దని చెప్పారు. మొబైల్ ఫోన్ల వల్ల విద్యార్థులు ఎక్కువగా చెడు మార్గం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు మొబైల్ ఫోన్ వినియోగం అవసరమైన మేరకే అనుమతించాలన్నారు. వి ద్యార్థులకు అవసరాలకు తగిన డబ్బు మాత్రమే అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రస్తు తం గంజాయి, డ్రగ్స్ వినియోగం లో విద్యార్థులు వుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.దీనివల్ల విద్యార్థుల చదువే కాక జీవితాలు కూడా నాశనం అవుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆర్ఎస్ కాలేజీ చైర్మన్ వడ్డే రాజే ష్ చౌదరి, ప్రిన్సిపల్ వేణుగోపాల రావు, వైస్ ప్రిన్సిపల్ జీవీ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మత సామరస్యతను చాటిచెప్పే పండుగ మొహర్రం

నవతెలంగాణ-రాజాపేట

తెలంగాణ సాంప్రదాయాలను, మత సామరస్యతను చాటి చెప్పే పండుగ, సమాజ శాంతి కోసం ప్రాణ త్యాగం చేసిన వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, జరుపుకునే పండుగ మొహర్రం అని ఎంఈఎఫ్ యాదాద్రి భువనగిరి జిల్లా ఇన్‌చార్జ్, ఇంజ మహేష్ మాదిగ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండలం కాల్వపల్లి గ్రామంలో బుధవారం కుటుంబ సభ్యులతో పీర్లకు, దట్టికట్టి మొక్కులు చెల్లించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజలకు, మొహర్రం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో, ముస్లిం మత పెద్దలు, ఎండి యాకోబ్,ఎండి అన్వర్, అన్ని దళిత సంఘాల, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ 4 గ్రూప్‌ల ప్రమాణ స్వీకారం

నవతెలంగాణ-మిర్యాలగూడ



పట్టణంలోని విఘ్నేశ్వర ఎస్టేట్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ తరుణ, భాస్కర, చైతన్య జన సేవా సంఘం దివ్యాంగ, వనిత డైమండ్ క్లబ ల ప్రమాణ స్వీకారాలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పీఎంజేఎఫ్ లయన్ మోహన్ రావు తీగల, ఫాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్ పర్సన్ ఇన్స్టాలేషన్ ఆఫీసర్ గా పిఎంజెఎఫ్ లయన్ కె.వి ప్రసాద్(డిస్టిక్ వైస్ గవర్నర్), గెస్ట్ ఆఫ్ ఎక్స్ లెన్స్ పీఎంజేఎఫ్ కె ఎన్ ప్రసాద్(ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్) పిఎంజెఎఫ్ లయన్ శివశంకర్ రావు, జిల్లా క్యాబినెట్ సెక్రటరీ సింహాద్రి,జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ మురళీర్ రెడ్డి హాజరై నాలుగు క్లబ్ ల ఇన్స్టాలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట ఇన్స్టాలేషన్ చైర్ పర్సన్ గా ఎంజెఎఫ్ లయన్ మురహరి ఏచూరి, ఇన్స్టాలేషన్ కో చైర్ పర్సన్ గా ఎంజెఎఫ్ లయన్ భాగ్యలక్ష్మి ఏచూరి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం నాలుగు క్లబ్బుల నూతన సభ్యులను లయన్స్ క్లబ్ లో నూతన సభ్యుల బాధ్యతల గురించి వివరించి ప్రమాణ స్వీకారం చేయించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మిర్యాలగూడ తరుణ ప్రెసిడెంట్ క్యామ వెంకటేశం, సెక్రెటరీ సామ శ్రీనివాస్, ట్రెజరర్ పి సురేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ భాస్కర క్లబ్ నుండి ప్రెసిడెంట్ కె.రామ్ రెడ్డి, సెక్రెటరీ బి. ఆనంద్ కుమార్, ట్రెజరర్ పింకి శర్మ, సిజెఎస్ఎస్ దివ్యాంగ ప్రెసిడెంట్ సింగు రాంబాబు, సెక్రెటరీ గట్టు వెంకటేశ్వర్లు, ట్రెజరర్ శంకర్ రెడ్డి వనిత డైమండ్ ప్రెసిడెంట్ మాశెట్టి గీత సెక్రెటరీ, ఉప్పల సవిత, ట్రెజరర్ టి.సుజాత ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సర్వీస్ ప్రోగ్రాం లో భాగంగా పేద మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కార్యవర్గాలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఎంజేఎఫ్ లయన్ సతీష్ కుమార్, కోడె జి ఎల్ టి కోఆర్డినేటర్ లయన్ ప్రభాకర్ రెడ్డి చల్లా, జోన్ చైర్ పర్సన్ ఎం జె ఎఫ్ లయన్ శ్రీనివాస్ మాశెట్టి డైమండ్, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ సుందరి నాగయ్య, సాదినేని శ్రీనివాస్ రావు, బిక్కుమల్ల కిరణ్ కుమార్, కోల సైదులు, మాశెట్టి దివ్యశ్రీ, సామ సంతోషి, ముత్త మానస, కర్నాటి రమేష్, యనగండ్ల లింగయ్య, డాక్టర్ రాజు, బి. యం. నాయుడు, కోల జయ, చందోలు వెంకటరమణ, మందాలపు బాలమణి తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపురంలో ఘనంగా తొలి ఏకాదశి నగర సంకీర్తన

నవతెలంగాణ-రాజపేట



మండలంలోని రఘు నాథపురం గ్రామంలో ఏకాదశి నగర సంకీర్తనలో భాగంగా రఘునాథపురం భగవత్ సేవ సమాజం శాఖ ఆధ్వర్యంలో బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని నిర్వహించారు. ప్రియ భగవత్ భక్తులందరూ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి రామాలయం ప్రధాన వీధుల గుండా శివాలయం వరకు శివాలయం నుండి ప్రధాన వీధుల గుండా చిన్న గౌరాయపల్లి మీదుగా శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో చిలక లక్ష్మీనారాయణ దంపతులు, వల్లకాటి బాబురావు, సామల భాస్కర్,కటకం సంతోష్, బొడ్డుల వెంకటేశం, బింగి శివరాజ్, ఉప్పల సిద్ధిలింగం, బింగి పాండురంగం, బల్ల గణేష్, పాశికంటి ఉపేందర్, బింగి రమేష్, కటకం గణేష్,శ్రీమతి మాడూరి సునంద, బూరేల శ్రీవేణి,బిజ్జాల రమ్య ఉప్పల సంధ్యారాణి,బింగి గణేష్, భోగ శ్రీనివాస్, గొట్టిపాముల శ్రీనివాస్ ,సామల రమేష్, బిజ్జాల ఈశ్వర్ పాల్గొన్నారు.

పలు కార్యక్రమాల్లో... ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి దంపతులు

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్


చండూరు

మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో ఆందోల్ మైసమ్మ దేవాలయంలో బుధవారం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వారి సతీమణితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆందోల్ మైసమ్మ బోనాల ఉత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. దేవలమ్మ నాగారంలో శ్రీ ఆది మహావిష్ణువు స్వయంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి ప్రత్యేక పూజలో, ఆది మహావిష్ణువు పల్లకి సేవలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు పల్లకి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల అనంతరం జరగాల్సిన క్యాబినెట్ మంత్రి వర్గ విస్తరణ వాయిదా పడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి చౌటుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పబ్బు రాజు గౌడ్ పిఎసిఎస్ ఉపాధ్యక్షుడు చెనగోని అంజయ్య గౌడ్ దండు మల్కాపురం మాజీ ఎంపీటీసీ చిట్టెంపల్లి శ్రీనివాసరావు బ్లాక్ కాంగ్రెస్, టౌన్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల ఇంద్రసేనారెడ్డి బోయ దేవేందర్,నరసింహ గౌడ్ ఆదిమహావిష్ణువు దేవాలయ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి ఈవో మోహన్ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

చామలపల్లిలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దంపతులు పూజలు

చండూరు : చండూరు మండలం లోని చామలపల్లి గ్రామంలో ప్రతి తొలి ఏకాదశికి శ్రీసీతారామాంజనేయ స్వామి జాతర అంగరంగ వైభవంగా జరుగుతుంది. బుధవారం తొలి ఏకాదశి కావడంతో శ్రీ సీతారామాంజనేయ స్వామి జాతరకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సతీమణి లక్ష్మితో కలిసి వచ్చారు. దంపతులకు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన దంపతులకు అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ఇడికూడా గ్రామం లో పీర్ల పండుగ వేడుకల్లో పాల్గొని సవార్ ఎత్తుకొని ఆడారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం, , దోటి వెంకటేష్, డాక్టర్ కోడి శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ నేర్లకంటి రవికుమార్, సాపిడి రాములు, కదారి లక్ష్మణ్, కోడి గిరి బాబు, తదితరులు పాల్గొన్నారు.

పేర్ల వీరయ్య సంతాప సభ

నవతెలంగాణ-నార్కట్ పల్లి



నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భూవిజ్ఞానిస్త్ర విభాగంలో అధ్యాపకునిగా సేవలందించి పదవి విరమణ పొందిన పేర్ల వీరయ్య ఈనెల 6న మృతి చెందారు. అధ్యాపక వృత్తిలో ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది వివిధ రకాల ప్రభుత్వ రంగా సంస్థల లో, స్టేట్ గ్రౌండ్ వాటర్బోర్డ్, సెంట్రల్ రౌండ్ వాటర్ బోర్డ్, మైక అండ్ జియాలజీ, సింగరేణి, ఆయాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థలలో పనిచేస్తున్న శిష్యులు బుధవారం ఎంజీ యూనివర్సిటీలో పూర్వ విద్యార్థులు దాదాపు 200 మంది సంతాప సభను ఏర్పాటు చేసి 'ఘనంగా నివాళులు అర్పించారు.. ఈ సంతాప సభ కార్యక్రమంలో ఎంజి యూనివర్సిటీ .పూర్వపు రిజిస్టర్ ప్రొఫెసర్ కే.నరేందర్ రెడ్డి, పూర్వ విద్యార్థులు అందరు తమ గురువు పైన ఉన్న గౌరవాన్ని, అభిమానాన్ని , ప్రేమ వాత్సర్యాలను వ్యక్తం చేశారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోజియాలజి విభాగానికి చెందిన తృతీయ సంవత్సరంలో ప్రథమస్థానంలోఉత్తీర్ణులైన విద్యార్థులకు పేర్ల, వీరయ్య పేరు మీద రూ.50వేలతో బంగారు పథకాన్ని ప్రతిసంవత్సరం అందజేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సముద్రాల. ఉపేందర్. రీజనల్ డైరెక్టర్ , డాక్టర్. జి యాదగిరి జియాలజీ విభాగం హెచ్ ఓ డి ఎన్ జి కళాశాల , ఇంద్రకంటి. చంద్రయ్య. ఎంనర్సింహా రెడ్డి అసిస్టెంట్ డైరెక్టర్ జియాలజీ కె. మధుసూదన్ రెడ్డి, ఎంజి యూనివర్సిటీ జియాలజీ హెచ్ ఓ డి కే దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం ఆంజనేయులు పాల్గొన్నారు.

22, 23 తేదీల్లో గ్రామ పంచాయతీల ఎదుట ధర్నాలు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్



భువనగిరి మండలంలోని గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22, 23 తేదీలలో గ్రామపంచాయతీ కార్యాలయాల ముందు, 29వ తేదీన మండల తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. బుధవారం సీపీఐ(ఎం) భువనగిరి మండల కమిటీ సమావేశం స్థానిక సుందరయ్య భవన్ భువనగిరిలో మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఏదునూరు మల్లేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా అనేక గ్రామాలలో ప్రజలు పెద్ద ఎత్తున సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. సీపీఐ(ఎం) పోరుబాటలో భాగంగా ఈనెల ఒకటి నుంచి గ్రామాలను పర్యటిస్తే గ్రామాలలో నేటికీ రోడ్లు, మురికి కాలువలు, విద్యుత్తు, లింకు రోడ్లు, కాలువల పైన బ్రిడ్జిల నిర్మాణం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గ్రామాలలో సర్పంచుల పరిపాలన లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన అభివృద్ధి కుంటుపడిందని చాలా గ్రామాలలో చెత్త పేరుకుపోయి దోమలు ప్రజలను కుట్టడంతో అనేక రకాలైన వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. గ్రామాల్లో ఉన్న మౌలిక సమస్యలను పరిష్కరించడంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. నేటికీ అనేకమంది పేదలకు ఇండ్లు ఇళ్ల స్థలాలు లేక అవస్థలు పడుతున్నారని వారందరికీ ప్రభుత్వము తక్షణం ఇండ్లు ఇళ్ల స్థలాలు ఇవ్వవలసిన అవసరం ఉందని అన్నారు. ఇంకా పెన్షన్స్ రేషన్ కార్డులు లేనివారు కూడా అనేకమంది ఉన్నారని వారందరికీ వెంటనే ప్రభుత్వం బాధ్యతగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాలలో పెద్దపెద్ద కాలువల పైన బ్రిడ్జి నిర్మాణం చేయవలసి ఉన్నదని, కొన్ని గ్రామాలలో విద్యుత్తు సమస్య ఉన్నాయని, మరికొన్ని గ్రామాలలో భూముల సమస్యలు కూడా ఉన్నాయని వీటి పరిష్కారం కోసమే పంచాయతీ కార్యాలయాల ముందు, తహశీల్దార్ కార్యాలయం ముందు నిర్వహిస్తున్న ధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని నర్సింహ కోరారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యురాలు కొండమడుగు నాగమణి, మండల కమిటీ సభ్యులు సిలివేరు ఎల్లయ్య, అబ్దుల్లాపురం వెంకటేష్, మోటే ఎల్లయ్యలు పాల్గొన్నారు.